Follow: @ANNTELUGU
30-03-2026
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 92 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



దేశంలో అత్యంత శక్తివంతుల జాబితాలో..

## సీఎం రేవంత్ రెడ్డి

**ఏడాదిలో మరింత పెరిగిన ఇమేజ్**

28వ స్థానం నుండి 25వ స్థానానికి వచ్చిన సీఎం

కాంగ్రెస్ లో రాహుల్ తర్వాత పాపులర్ లీడర్ రేవంత్

పవన్ కల్యాణ్ కు 68వ స్థానం

**హైదరాబాద్, మహా :** దేశంలో అత్యంత శక్తి వంతుల జాబితాను ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విడుదల చేసింది. గతంలో మాదిరిగా ఈసారి కూడా ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా తొలి రెండు స్థానాలు దక్కించుకున్నారు. దశాబ్దకాలంగా ఈ జాబితాను ఆ సంస్థ విడుదల చేస్తూ వస్తోంది. ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో చాకచక్యంగా వ్యవహరించిన పీయూష్ గోయల్ ఐదో ప్లేస్ లో నిలిచారు. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, విదేశాంగ మంత్రి జైశంకర్ టాప్ 10లో నిలిచారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### బీజేపీ వస్తే చికెన్, చేపలు నిషేదం



- ఆహారపు అలవాట్లపై ఆంక్షలు
- మమతాబెనర్జీ సంచలన వ్యాఖ్యలు

02

### తన డ్రైవర్ కొడుకు ఎమ్మెల్యే అభ్యర్థి



- ప్రకటించిన తళపతి విజయ్
- వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్న తండ్రీకొడుకులు
- రెండు చోట్ల పోటీ చేస్తున్న విజయ్

02

### హరీష్ రావునే బలి చేస్తున్నారు



- రేవంత్-కేటీఆర్ మధ్య ఒప్పందం
- కాళేశ్వరం లక్ష కోట్ల దోపిడీపై ఎందుకు మౌనం?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణ

02

# అట్టుడికిన సభ

## హాట్ హాట్‌గా అసెంబ్లీ

- పొంగులేటిని బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ సభ్యుల పట్టు
- హరీష్, కేటీఆర్, తలసాని సహ 24మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్
- హౌజ్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్.. మద్దతుగా బీజేపీ ఎమ్మెల్యే
- కేసీఆర్, హరీశ్ రావును జైలులో పెట్టిన తర్వాతే మాట్లాడండి
- కాళేశ్వరంపై సీబీఐకిస్తే చర్యలేవీ.. బీజేపీ నేతలపై భగ్గుమన్న సీఎం రేవంత్
- పొంగులేటిని భూములకోసమే టార్గెట్ చేస్తున్నారు సీఎం ఫైర్
- కౌశిక్ రెడ్డి తీరుతో సభలో రాద్ధాంతం.. శ్రీహరిని కాల్చేస్తామంటూ సైగలు చేశారని సభ్యుల ఆగ్రహం

**హైదరాబాద్, మహా:**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఆదివారం రణరంగంగా మారాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్ వ్యవహారం సభను కుదిపేసింది. ఈ అంశంపై విచారణకు సభా సంఘం వేయాలని, మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేయడమే కాకుండా, సభా కార్యక్రమాలకు పదేపదే అడ్డుతగులుతున్నారన్న కారణంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా 24 మంది ఎమ్మెల్యేలను బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

### రాఘవ కన్ స్ట్రక్షన్స్‌పై పట్టు

ఉదయం సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి భారీ నిరసన చేపట్టారు. "మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలి", "అక్రమ మైనింగ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి" అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం అదే ప్లకార్డులతో సభలోకి ప్రవేశించిన సభ్యులు, ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కాగానే వాయిదా తీర్మానానికి పట్టుబట్టారు. దీనిని స్పీకర్ తిరస్కరించడంతో సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లారు. మార్షల్స్ వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది.

### నిప్పులు చెరిగిన రేవంత్ రెడ్డి

సభలో బీఆర్ఎస్ సభ్యుల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తుతూనే, బీజేపీ

మిగతా 2లో



### కేసీఆర్, హరీశ్ రావును జైలులో పెట్టిన తర్వాతే మాట్లాడండి

కాళేశ్వరంపై సీబీఐకిస్తే చర్యలేవీ.. బీజేపీ నేతలపై భగ్గుమన్న సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2లో

### తల్లిదండ్రుల సంరక్షణకు చట్టబద్ధమైన భరోసా

- భక్తి లేనివారికి భయం కలిగించేందుకే ఈ చట్టం
- కన్నవారిని రోడ్డున పడేస్తే ఊరుకోం: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

03



### సూర్యా భాయ్ గోల్డ్ గుట్టురట్టు

- ఒంటిపై ఉన్నదంతా రోల్డ్ గోల్డే
- ఐటీ అధికారుల షాకింగ్ వెల్లడి
- చికెన్ సెంటర్ యజమాని.. కిలోల కొద్దీ రోల్డ్ గోల్డ్ నగలు

**హైదరాబాద్, మహా:**

పాతబస్తీ 'గోల్డ్ మ్యాన్'గా సోషల్ మీడియాలో విపరీతమైన పాపులారిటీ సంపాదించుకున్న సూర్యా భాయ్ అసలు రంగు బయటపడింది. కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు ధరించి, హల్చల్ చేసే ఆయన వేసుకున్న నగల్లో మెరిసేదంతా బంగారం కాదని, అదంతా కేవలం 'రోల్డ్ గోల్డ్' (ఇమిటేషన్ జ్యువెలరీ) అని

మిగతా 2లో



### యుద్ధం ఏదైనా.. ఐక్యంగా ఎదుర్కొందాం

- అప్రమత్తంగా ఉండాలి, వదంతులు నమ్మొద్దు
- గల్ఫ్ దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు.. మన్ కీ బాత్ వేదికగా ప్రధాని మోదీ పిలుపు

**ఢిల్లీ, మహా:** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల ఎటువంటి పరిస్థితులు తలెత్తినా, 140 కోట్ల మంది భారతీయులు ఒకే తాటిపై నిలిచి ఐక్యంగా ఎదుర్కొంటారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఆదివారం తన 132వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

మిగతా 3లో



### ఏ పథకమైనా ఖమ్మంకేనా?

- మంత్రుల నియోజకవర్గాల్లోనే పనులా?
- రాజగోపాల్ రెడ్డి రుస రుస
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల అన్ని నియోజకవర్గాలను పట్టించుకోవాలని రిక్వెస్ట్

02

### నీ తమ్ముడిపై సిద్ధమైతే.. నా తమ్ముడిపై నేనూ సిద్ధం

**సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్**

**హైదరాబాద్, మహా :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బామ్మర్ది తమ్ముడు చేసిన అవినీతిపై హౌస్ కమిటీ విచారణకు సిద్ధమైతే నేనూ మా తమ్ముడిపై హౌస్ కమిటీ విచారణకు సిద్ధం అని మాజీ మంత్రి, శాసనసభలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. హౌస్ కమిటీ వద్దు.. సీఐడీ విచారణ వద్దు.. ఇద్దరం కలిసి సిట్టింగ్ జడ్జితో విచారణకు వెళ్దామన్నారు. ఈ విషయంలో విచారణకు రేవంత్ రెడ్డికి దమ్ముందా అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీ అవినీతికి పాల్పడిందని అందరికీ అర్థం అయిందని, ప్రభుత్వం డిఫెన్స్ లో పడింది కాబట్టి ముఖ్యమంత్రి ఎదురు దాడి చేస్తోందన్నారని ఆరోపించారు. సమాధానం లేదు కాబట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. సవాల్ చేసి అడుగుతున్నా.. విచారణకు సిద్ధమా?' అంటూ సీఎం



రేవంత్‌ను హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. తప్పు చేయకపోతే ఎందుకు తోక ముడుస్తున్నారు? అని నిలదీశారు.

మిగతా 2లో

### వాంఖడేలో ముంబై విశ్వరూపం!

- 14 ఏళ్ల 'తొలి మ్యాచ్' శాపం పరార్
- హిట్ మ్యాన్ సునామీ.. రికెల్టన్ విధ్వంసం..
- 221 పరుగుల లక్ష్యం.. చిటికెలో ఛేద్యం
- 300వ మ్యాచ్‌లో అజేయ రికార్డు.. కోల్‌కతా బౌలర్లు బెంబేలు..



వివరాలు 3లో

### కౌశిక్ రెడ్డికు సభ్యత్వరద్దు గండం?

**ఎథిక్స్ కమిటీకి సిఫార్సు**

**సభ్యత్వం రద్దుచేయాలని కాంగ్రెస్ సభ్యుల డిమాండ్**

**హైదరాబాద్, మహా:** సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్ల అనుచిత సైగలతో కాల్చేస్తా అంటూ బెదిరించిన కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వం రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డిని నియంత్రించకపోగా... కేటీఆర్, హరీష్‌రావు ప్రోత్సహించడం దురదృష్టకరమని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ సహా పలువురు మంత్రులు అన్నారు. ఈ వ్యవహారంపై ఎథిక్స్ కమిటీకి సీఎం సిఫార్సుచేశారు. కౌశిక్ రెడ్డి వయసు పెరిగింది కానీ..బుద్ధి పెరగలేదని కాలే యాదయ్య ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ సభ్యులు చప్పట్లు కొట్టాల్సి సభలో కాదని, కోఠి, అబిడ్స్ లో కొట్టాలని ఎద్దేవా చేశారు. శాసనసభ చరిత్రలో చీకటి రోజు అని జైవీర్ రెడ్డి అన్నారు. మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వంశీకృష్ణ, యశ్వసినీరెడ్డి, వెడ్మ బొజ్జు, మురళీనాయక్, కేఆర్. నాగరాజు, వేముల వీరేశం,

మిగతా 2లో





### 2027 పుష్కరాలపై సీఎం సమీక్ష

- బాసర జ్ఞాన సరస్వతి టెంపుల్ కు నూతన హంగులు
- మాస్టర్ ప్లాన్‌పై ముఖ్యమంత్రి కీలక సూచనలు

**హైదరాబాద్, మహా**

తెలంగాణ జీవనాడి గోదావరి నది తీరంలో 2027 జూన్ మాసంలో జరగబోయే పుష్కరాలను ఒక చారిత్రాత్మక ఘట్టంగా మలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. బాసర నుంచి భద్రాచలం వరకు ప్రవహించే గోదావరి తీరప్రాంతం అంతటా ఆధ్యాత్మిక పరిమళం వెదజల్లేలా, భక్తులకు కనీవినీ ఎరుగని రీతిలో వసతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

మిగతా 2లో

### భట్టి విక్రమార్కపై సీఎం ప్రశంసలు

భట్టి విజ్ఞానానికి కేసీఆర్ భయపడ్డారు

02




# అట్టుడికిన సభ

(మొదటిపేజీ తరువాయి)

తీరును కూడా తప్పుబట్టారు. "కేసీఆర్, హరీశ్‌రావులను జైల్లో పెట్టిన తర్వాతే బీజేపీ నేతలు నీతులు మాట్లాడాలి" అని ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఖనిజ సంపద ద్వారా వచ్చే ఆదాయం పెరిగిందని, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

**కౌశిక్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం**

ఇదే సమయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, సీనియర్ నేత కడియం శ్రీహరికి చేసిన సైగలు, వ్యాఖ్యలు సభలో మంటలు రేపాయి. కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు. మరోవైపు, మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. అక్రమ మైనింగ్ వ్యవహారంపై ఇప్పటికే ముఖ్యమంత్రి సీబీసీఐడీ విచారణకు ఆదేశించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతల వద్ద ఏవైనా పక్కా ఆధారాలు ఉంటే అధికారులకు సమర్పించాలని, దర్యాప్తు సంస్థలపై నమ్మకం లేకుండా సభను అడ్డుకోవడం సరికాదని హితవు పలికారు.

**సస్పెన్షన్ అనంతరం హైడ్రామా..**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సస్పెన్షన్ తీర్మానాన్ని సభ ఆమోదించడంతో 24 మంది ఎమ్మెల్యేలు బయటకు వచ్చారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి వంటి కీలక నేతలందరినీ మార్షల్స్ సభ నుంచి బయటకు పంపించారు. అయితే, అసెంబ్లీలోని కేసీఆర్ ఛాంబర్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకోవడంతో మరోసారి హైడ్రామా నడిచింది. తమ సొంత ఛాంబర్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో భేటీ అయిన నేతలు.. తమ పోరాటం అసెంబ్లీకే పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అవసరమైతే గవర్నర్‌ను కలిసి మంత్రి పొంగులేటి అవినీతి చిట్టాను సమర్పిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కేసీఆర్, హరీశ్ రావును జైలులో పెట్టిన తర్వాతే మాట్లాడండి

## కాళేశ్వరంపై సీబీఐకిస్తే చర్యలేవీ.. బీజేపీ నేతలపై భగ్గుమన్న సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** కేసీఆర్, హరీష్‌రావులను జైల్లో పెట్టిన తర్వాతే బీజేపీ నేతలు మాట్లాడాలని, వారికి మాట్లాడే అర్హతేలేదని సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని, కేసీఆర్ కుటుంబం వేల కోట్లు దోచుకుందని ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చి పదే పదే చెప్పారని అన్నారు. కాళేశ్వరం విచారణను సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో పెడతామని కేంద్ర మంత్రి హోదాలో స్వయంగా కిషన్ రెడ్డి చెబితే బీజేపీ మాటలు నమ్మి సీబీఐ విచారణకు ఇస్తే ఇప్పటి వరకు చర్యలు లేవన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆదివారం శాసన సభలో రాఘవ కన్ స్ట్రక్షన్ అంశంపై సభలో గందరగోళం ఏర్పడింది. ఈ కంపెనీ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని, మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ సభ్యులు వెల్ లోకి దూసుకు వెళ్లి నినాదాలు చేసింది. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి రమణారెడ్డి మాట్లాడుతూ సభా సమయం వృథా అవుతోందని అందువల్ల హౌస్ కమిటీ వేయాలని కోరారు. ఈ నేపథ్యంలో సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ ఏదో చేస్తుందని నమ్మి ఇదే శాసనసభ వేదికగా కాళేశ్వరం కుంభకోణంపై విచారణను సీబీఐకి అప్పగిస్తే 48 గంటలు కాదు కదా నెలలు గడుస్తున్నా చర్యలు లేవన్నారు. కాళేశ్వరం కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును జైల్లో పెట్టిన తరువాత బీజేపీ నేతలు సూచనలు చేస్తే బాగుంటుందన్నారు. బీఆర్ఎస్ , బీజేపీ రెండు ఒక్కటేనని, పార్లమెంట్ , పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కలిసే పోటీ చేసి సీట్లు, ఓట్లు పంచుకున్నాయని ధ్వజమెత్తారు.

**హరీశ్ తమ్ముడి అక్రమాల వల్లే**

మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్‌లో ఓ ప్రైవేటు పరిశ్రమ యజమానులను బెదిరించి హరీశ్ రావు తమ్ముడు మహేశ్ రావు, ఆయన మామ హనుమంతరావు ధరణిని అడ్డం పెట్టుకుని వందల ఎకరాలు అక్రమంగా భూ బదలాయింపు చేసుకున్నారని సీఎం ఆరోపించారు. ఈ విషయంలో నేను నిర్దిష్టమైన ఆరోపణలు చేస్తున్నాను. ఈ అక్రమాలపై హౌస్ కమిటీ వేయడానికి మేం సిద్ధంగా ఉన్నామని, హరీశ్ రావుకు దమ్ము, ధైర్యం ఉంటే ఇందుకు మీరు సిద్ధమో కాదో చెప్పాలన్నారు. బాలానగర్ భూముల విషయంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ నుంచి రిపోర్టు అడిగారని దాంతో ఇందులో స్వయంగా మా సోదరుడు, మా మామ ఉన్నారని ఈ కేసులో సహకరించాలని మంత్రి పొంగులేటికి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారని చెప్పారు. ఇందుకు మంత్రి కుదరదనడంతో అప్పటి నుంచి పొంగులేటిని హరీశ్ రావు టార్గెట్ చేస్తున్నారని సీఎం ఆరోపించారు.

**హరీష్ ను కేటీఆర్ తిట్టారు**

నిన్న సభలో మైనింగ్ అక్రమాలపై చర్చకు అవకాశం ఇచ్చామని సీఏ చెప్పారు. చర్చ అనంతరమే 2024 జూన్ 2 నుంచి రాఘవ కన్ స్ట్రక్షన్ వరకు సీబీ సీఐడీ విచారణకు ఆదేశామన్నారు. సీఐడీ విచారణ ఆదేశాలతో హరీశ్ రావు, కేటీఆర్, సంతోశ్ రావు గొడవ పడ్డారని అన్నారని హరీశ్ రావును కేటీఆర్ బండబూతులు తిట్టారని సీఎం ఆరోపించారు. నీ వల్ల నా మెడకు ఉరి పడేలా ఉందని హరీశ్ రావుపై కేటీఆర్ అన్నారని ఆరోపించారు. హరీశ్ రావు, కేటీఆర్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైందన్నారు. హరీష్‌రావు నిజాయితీపరుడని కేటీఆర్, వెంకటరమణా రెడ్డి నమ్మితే హౌస్ కమిటీ వేయడానికి ఒప్పుకోవాలన్నారు.



# నీ తమ్ముడిపై సిద్ధమైతే.. నా తమ్ముడిపై నేనూ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

20 కుంభకోణాలపై విచారణకు ప్రభుత్వానికి తాము లేఖ రాశామని హరీశ్ రావు గుర్తు చేశారు. సీఎం రేవంత్‌కు దమ్ముంటే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణాలపై తమ పోరాటం ఆపేదే లేదని బల్లగుద్ది మరీ చెప్పారు హరీశ్ రావు.

**సమాధానం చెప్పలేకే.. డైవర్షన్ దాడి : హరీశ్ రావు**

మంత్రి పొంగులేటి కంపెనీ అవినీతికి పాల్పడిందని హరీశ్ రావు ఆరోపించారు. దీనిలో అవినీతి జరిగినట్లు సభలో సీఎం రేవంత్ అంగీకరించారని గుర్తు చేశారు. మైనింగ్‌లో తప్పు జరిగినట్లు నిండు సభలో సీఎం ఒప్పుకున్నారన్నారు. ఆధారాలతో పాటు మంత్రి పొంగులేటి దొరికిపోయారని పేర్కొన్నారు. అయినా ముఖ్యమంత్రి ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి సమాధానం లేకనే.. సీఎం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు.

# ఏ పథకమైనా ఖమ్మంకేనా?

## మంత్రుల నియోజకవకర్గాల్లోనే పనులా? .. రాజగోపాల్ రెడ్డి రుస రుస

## కాంగ్రెస్ ఎమ్మెల్యేల అన్ని నియోజకవర్గాలను పట్టించుకోవాలని రిక్వెస్ట్

**హైదరాబాద్, మహా :** ఏ పథకం వచ్చినా ఖమ్మంలో ముగ్గురు మంత్రులున్నారు.. అటే తీసుకెళ్తున్నారు. మేం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలం కాదా? అంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన నియోజకవర్గ సమస్యలపై నిలదీశారు. బడ్జెట్ సమావేశాలలో భాగంగా ఆదివారం అసెంబ్లీలో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి సర్కారుపై ప్రశ్నలవర్షం కురిపించారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌ను అభివృద్ధి చేసుకున్నట్లు, నాకు నా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఉండదా?, భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గానికి, ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్ నగర్ నియోజకవర్గానికి లిఫ్ట్ లు తరలిస్తున్నారు. మేమేం పాపం చేశాం, మాకెందుకు నిధులు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. మా నియోజకవర్గాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు కనీసం బిల్లులు కూడా మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం అంటే రేవంత్ రెడ్డి, మంత్రులు మాత్రమే కాదు, ఎమ్మెల్యేలు అందరూ కలిస్తేనే ప్రభుత్వం అని తెలుసుకోకపోతే ఎలా అని ప్రశ్నించారు. మేం ప్రజలు ఓట్లేస్తేనే గెలిచాం, సీఎం మంత్రులు కూడా అలానే గెలిచారు. అయినప్పటికీ నిధుల కోసం సీఎం చుట్టూ, మంత్రుల చుట్టూ తిరగాలా? అని నిలదీశారు. ప్రాంతాలు, నియోజకవర్గాలపై వివక్ష చూపొద్దంటూ అందరినీ సమానంగా చూడాలి, అన్ని ప్రాంతాలు తెలంగాణవే అని గుర్తించాలన్నారు. నిధులు ఇవ్వాల్సిందేనని, లేకపోతే ప్రజల్లో తిరుగుబాటు వస్తుందన్న విషయాన్ని గుర్తించుకోవాలని కోరారు.

# భట్టి విక్రమార్కపై సీఎం ప్రశంసలు

## భట్టి విజ్ఞానానికి కేసీఆర్ భయపడ్డారు

**హైదరాబాద్, మహా:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల జల్లు కురిపించారు. ఉప ముఖ్యమంత్రి, మిత్రుడు భట్టి విక్రమార్క గారు అపారమైన విజ్ఞానవంతులు. చదువులో, లోతైన జ్ఞానంలో ఆయన నిష్ణాతులు. గత బీఆర్ఎస్ పాలకులందరికంటే అత్యంత తెలివైన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది భట్టి విక్రమార్క గారే. గత ప్రభుత్వ హయాంలో భట్టి గారు సీఎల్పీ నాయకుడిగా ఉన్నప్పుడు, ఆయన మేధస్సును చూసి అప్పటి పాలకులు భయపడ్డారు. ఎక్కడ వారి తప్పులను ఎండగడతారో, ఎక్కడ ప్రజలకు వాస్తవాలు తెలిసిపోతాయో అన్న భయంతో ఆయన స్థాయిని తగ్గించేలా ప్రవర్తించారు. కానీ భట్టి గారు ఎక్కడా వెనకడుగు వేయలేదు. అసెంబ్లీలో గొంతు నొక్కాలని చూస్తే, ఆయన ప్రజల్లోకి వెళ్లారు. ఎండను సైతం లెక్కచేయకుండా వేల కిలోమీటర్ల మేర 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర చేపట్టారు. నేడు రాష్ట్రంలో 'ప్రజా పాలన' సాకారం కావడానికి భట్టి పోరాటం, ఆయన పడ్డ శ్రమ వెలకట్టలేనివి. నేడు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం భట్టి విక్రమార్క గారు అత్యుత్తమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దాన్ని చూసి ఓర్వలేక, అంశాలవారీగా చర్చించే దమ్ము లేక ప్రతిపక్షాలు ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం అత్యంత హేయమైన చర్య. ఇది ఏమాత్రం సబబు కాదు. భట్టి లాంటి సమర్థుడిపై చేసే విమర్శలు వారి అజ్ఞానానికి నిదర్శనం. తెలంగాణ అభివృద్ధి పథంలో భట్టి విక్రమార్క పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుంది. సమర్థులైన నాయకులను గౌరవించడం నేర్చుకోకపోతే ప్రతిపక్షాలకు కాలమే సమాధానం చెబుతుంది అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భట్టి పై సీఎం చేసిన వ్యాఖ్యలకు సభ్యులు హర్షధ్వనాలు ప్రకటించారు.

# హరీష్ రావునే బలి చేస్తున్నారు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని, అందుకే వారిద్దరూ కుమ్మక్కు రాజకీయాలు నడిపిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్‌పై ఉన్న అవినీతి కేసుల జోలికి ప్రభుత్వం వెళ్లకపోవడానికి ఈ 'డీల్' కారణమని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, రేవంత్ రెడ్డి కేవలం హరీష్ రావును మాత్రమే లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు.

**హరీష్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారు**

కాళేశ్వరం ప్రాజెక్టులో దాదాపు లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని గతంలో రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని, మరి ఇప్పుడు కేవలం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన రూ.9 వేల కోట్ల అవినీతిపైనే ఎందుకు విచారణ కోరుతున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. కేవలం హరీష్ రావు పాత్ర ఉన్న అంశాలకే విచారణను పరిమితం చేస్తూ, కేసీఆర్ కుటుంబం ప్రమేయం ఉన్న మిగతా భారీ అవినీతిని తొక్కిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్, కవితల మధ్య నెలకొన్న విభేదాలను తొలగించి వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు రేవంత్ రెడ్డి మధ్యవర్తి పాత్ర పోషిస్తున్నారని ఎద్దేవా చేశారు.

**ఇద్దరి మధ్య కుదిరిన 'డీల్' అదేనా?**

బీఆర్ఎస్ పాలనలో కేటీఆర్ కనుసన్నల్లోనే అంతా సాగిందని, నాడు రేవంత్ రెడ్డిని జైలుకు పంపిన విషయాన్ని ఆయన మర్చిపోయారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. "కేటీఆర్‌పై రేవంత్ రెడ్డికి ఇప్పుడు అమితమైన ప్రేమ పుట్టుకొస్తోంది. ఫార్ములా ఈ రేసింగ్, డ్రగ్స్, ఫాంహౌజ్ కేసుల గురించి సీఎం ఎందుకు మాట్లాడటం లేదు?" అని నిలదీశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయాలనే యోచనలో రేవంత్ రెడ్డి ఉన్నారని, అందుకే హరీష్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్‌కు సలహాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. మైనింగ్ స్కామ్ వంటి అంశాలపై విచారణలన్నీ కేవలం "గతంలో మీరు దోచుకున్నారు.. ఇప్పుడు మేము దోచుకుంటాం.. నోరు మెదపవద్దు" అని బెదిరించడానికే తప్ప, అవినీతిని వెలికితీసే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు.

**బీఆర్ఎస్‌తో పొత్తు ప్రశ్నే లేదు**

కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడే బీజేపీ, అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. రాజకీయ వారసులకు టికెట్లు ఇవ్వబోమని ప్రధాని మోదీ ఇప్పటికే తేల్చిచెప్పారని గుర్తు చేశారు. ఇక నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు వార్తలతో రేవంత్ రెడ్డిలో వణుకు మొదలైందని, ఆ డిప్రెషన్‌తోనే ఆయన దక్షిణాది, ఉత్తరాది అనే భేదాలను సృష్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల ఖర్చు కోసం తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి నిధులు సమకూరుస్తున్నారని ఆరోపించారు.

**ఐదు రాష్ట్రాల్లో బీజేపీ జయకేతనం ఖాయం**

రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించబోతోందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. అస్సాం, పశ్చిమ బెంగాల్‌తో పాటు తమిళనాడు, కేరళలోనూ బీజేపీ అద్భుత ఫలితాలను సాధిస్తుందని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ఏ ఒక్క రాష్ట్రంలోనూ గెలిచే అవకాశం లేదని ఆయన జోస్యం చెప్పారు.

## బీజేపీ వస్తే చికెన్, చేపలు నిషేదం

## ఆహారపు అలవాట్లపై ఆంక్షలు

## మమతాబెనర్జీ సంచలన వ్యాఖ్యలు

**కోల్‌కతా, మహా:** పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ప్రచార పర్వం ఊపందుకున్న తరుణంలో ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ భారతీయ జనతా పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఆదివారం జరిగిన ఒక భారీ బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. బెంగాల్‌లో బీజేపీ గనుక అధికారంలోకి వస్తే ప్రజలు తమకు నచ్చిన ఆహారాన్ని తినే స్వేచ్ఛను కోల్పోతారని హెచ్చరించారు. ముఖ్యంగా చేపలు, మాంసం, గుడ్లు తినేవారిపై ఆంక్షలు విధించే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే ఇటువంటి పరిస్థితులు ఉన్నాయని, బెంగాల్‌లో ఆ పార్టీ జైత్రయాత్ర కొనసాగితే ఇక్కడి ఆహార సంస్కృతి, సంప్రదాయాలు పూర్తిగా దెబ్బతింటాయని ఆమె పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాలు ఏకపక్షంగా ఉంటాయని, ఇతర మతాల పట్ల ఆ పార్టీకి కనీస గౌరవం లేదని మమత మండిపడ్డారు. కేవలం అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కోసమే బీజేపీ అల్లర్లను ప్రేరేపిస్తుందని, అమాయక ప్రజల ప్రాణాలను సైతం లెక్కచేయదని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టి ఓట్లు దండుకోవడమే ఆ పార్టీ ప్రధాన అజెండా అని ధ్వజమెత్తారు. బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో గిరిజనులు, మహిళల రక్షణ కరువైందని, అక్కడ నిత్యం వారిపై జరుగుతున్న దాడులే ఇందుకు నిదర్శనమని ఆమె గుర్తు చేశారు. బెంగాల్ ప్రజలు అప్రమత్తంగా ఉండి, రాష్ట్రంలోని మత సామరస్యాన్ని, తమ హక్కులను కాపాడుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

బీజేపీ అధికారంలోకి వస్తే వ్యక్తిగత స్వేచ్ఛకు తావుండదని, వారు విధించే నియమ నిబంధనల ప్రకారమే ప్రజలు జీవించాల్సి వస్తుందని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. అభివృద్ధి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ, తెరవెనుక విభజన రాజకీయం చేస్తోందని ఆరోపించారు. బెంగాల్ మట్టి వాసన తెలిసిన వారు, ఇక్కడి సంస్కృతిని గౌరవించే వారు మాత్రమే రాష్ట్రాన్ని పాలించాలని, బయటి శక్తులకు ఇక్కడ చోటు లేదని ఆమె స్పష్టం చేశారు.

# 2027 పుష్కరాలపై సీఎం సమీక్ష



(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా ఈ పుష్కరాలను కేవలం ఒక ఉత్సవంగా చూడకుండా, శాశ్వత ప్రాతిపదికన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే అవకాశంగా మలుచుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజా భవన్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షించిన ముఖ్యమంత్రి, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా లోపాలు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. పుష్కర ఏర్పాట్లలో ప్రధానంగా సాంకేతికతకు, క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా, పుష్కరాల నిర్వహణకు అత్యంత అనువైన ప్రదేశాలను గుర్తించేందుకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీని నియమించాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి రాబోయే 15 నుంచి 20 రోజుల్లోగా తన ప్రాథమిక నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఈ నివేదిక ఆధారంగా అధికారుల కమిటీ తదుపరి అంచనాలను రూపొందిస్తుంది. ఈ క్రతువులో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా కేబినెట్ సబ్ కమిటీ పరిశీలన అనంతరం తుది నిర్ణయం తీసుకునేలా ఒక క్రమబద్ధమైన యంత్రాంగాన్ని ప్రభుత్వం సిద్ధం చేసింది. కేవలం తాత్కాలిక ఏర్పాట్లతో సరిపెట్టకుండా, శాశ్వత అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం నొక్కి చెప్పారు. వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం లోపించకుండా ఉండేందుకు ప్రజా భవన్‌లో ప్రత్యేకంగా ఒక 'వార్ రూమ్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం గమనార్హం. నీటి పారుదల, పర్యాటక, దేవాదాయ శాఖలు ఒకే తాటిపైకి వచ్చి పనిచేస్తేనే లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. బాసర, ధర్మపురి, కాళేశ్వరం మరియు భద్రాచలం వంటి ప్రధాన దేవాలయాల వద్ద ఘాట్ల విస్తరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే పర్యాటక ప్రదేశాల్లోనూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఘాట్లకు చేరుకునే రోడ్లు, వివిధ పట్టణాల మధ్య కనెక్టివిటీ విషయంలో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా రహదారుల మరమ్మతులు, విస్తరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థాన అభివృద్ధికి సంబంధించి అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. బాసర క్షేత్రాన్ని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మార్పులు చేర్పులను ఆయన సూచించారు. ఆలయ విస్తరణతో పాటు భక్తులకు అవసరమైన నివాస వసతులు, ఇతర సౌకర్యాలను మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వచ్ఛ భారత్ , జల్ జీవన్ మిషన్ వంటి నిధులను కూడా ఈ పుష్కర ఏర్పాట్లకు సమర్థవంతంగా వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు..



# కౌశిక్ రెడ్డికు సభ్యత్వ రద్దు గండం?

(మొదటిపేజీ తరువాయి)

రాంచందర్ నాయక్, గడ్డం వినోద్ కుమార్, ఆదినారాయణ, రాగమయి. రాందాస్ నాయక్, శ్రీగణేష్, బీర్లఅయిలయ్య, ఆది శ్రీనివాస్ తదితరులు కౌశిక్ రెడ్డిపై తీవ్రస్థాయిలో భగ్గుమన్నారు.

**గడీకి వేలాడదీస్తాం : మందుల సామేలు**

దళిత బిడ్డా..సీనియర్ సభ్యులు కడియం శ్రీహరిని బెదిరిస్తావా? ఖబడ్దార్ కౌశిక్ రెడ్డి అని సామేలు హెచ్చరించారు. గడీకి వేలాడదీస్తాం కత్తుల కోలాటమాడుతాం అంటూ ఫైర్ అయ్యారు. మీ ఇంట్లో మీ చెల్లి వికెట్ పడిపోయింది. నిన్ను కూడా మీ బావ హరీష్ రావు మోసం చేస్తారు..హరీష్ రావు దగ్గర మీ కంటే ఎక్కువ డబ్బు ఉంది. తస్మాత్ జాగ్రత్త' అని కేటీఆర్ పై సైటెర్లు వేశారు.

## దేశంలో అత్యంత శక్తివంతుల జాబితాలో..

# సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఈ జాబితాలో ఏపీ సీఎం చంద్రబాబు దేశంలో అత్యంత శక్తివంతమైన తెలుగు నాయకుడిగా నిలిచారు. ఆయన 13వ స్థానం దక్కించుకున్నారు. రాహుల్ గాంధీ 9వ ర్యాంకులో ఉండగా తర్వాత రెండో అత్యంత శక్తివంతమైన ఆ పార్టీ నాయకుడిగా రేవంత్‌రెడ్డి అవతరించారు. ఆయన 25వ స్థానంలో నిలిచారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 68వ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా తన ర్యాంకును 35వ స్థానానికి మెరుగుపరుచుకున్నారు. 55వ స్థానంలో ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ కాగా, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు 90వ స్థానంలో నిలిచారు.

**రైజింగ్ స్టార్ రేవంత్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాస్ లీడర్‌గా, ఫైర్ బ్రాండ్ గా కాంగ్రెస్ లో పాపులర్ అయ్యారు. ఇపుడు కాంగ్రెస్ పార్టీలో రాహుల్ తర్వాత పాపులర్ లీడర్ గా రేవంత్ మారారు. రాహ/ల్ 9వ ర్యాంకులో ఉండగా రేవంత్ 25వ ర్యాంకులో, ్రియాంక 35వ ర్యాంకులో ఉన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రెండు సంవత్సరాలు పూర్తయ్యాయి. అంతర్గత ప్రతిపక్ష ఒత్తిళ్లు రేవంత్ ప్రభావం తగ్గించలేకపోతున్నాయి. వివాదాలకు అతీతంగా, కులాల వారీగా చేసిన సర్వే ద్వారా ఆయన రాజకీయంగా తెలివైన అడుగు వేశారు. బీసీ వర్గాలకు రిజర్వేషన్లు పెంచాలని ప్రతిపాదించారు. కుల పరిమితులను దాటి తన మద్దతును బలపరచడంపై ఆయన దృష్టి పెట్టారు. రాజకీయ విజయాలు, వ్యూహాలు ఆయనను పటిష్టం చేశాయి. రేవంత్ రెడ్డి జాతీయ రాజకీయాల్లోనూ ముఖ్య వ్యక్తిగా ఎదిగారు, ఎందుకంటే ఆయన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , కాంగ్రెస్ కేంద్ర నాయకత్వానికి సన్నిహితంగా ఉన్నారు. భారత్ జోడో యాత్ర ఆయనను గాంధీకి మరింత దగ్గర చేసింది, జనసమూహాన్ని ఆకర్షించే సామర్థ్యాన్ని చూపించింది. 2017లో కాంగ్రెస్‌లో చేరిన ఆయన, పార్టీలో విభేదాలను నియంత్రించడంలో కూడా విజయవంతమయ్యారు.

# తన డ్రైవర్ కొడుకు ఎమ్మెల్యే అభ్యర్థి

## ప్రకటించిన తళపతి విజయ్..

## వేదికపైనే కన్నీళ్లు పెట్టుకున్న తండ్రీకొడుకులు

## రెండు చోట్ల పోటీ చేస్తున్న విజయ్

**చెన్నై, మహా :** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపిన నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు దళపతి విజయ్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం తన వ్యూహాన్ని సిద్ధం చేశారు. రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిస్తూ ఆయన తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు సంచలనంగా మారింది. తన సొంత డ్రైవర్, ప్రస్తుతం తన పీఏగా వ్యవహరిస్తున్న రాజేంద్రన్ కుమారుడు శబరినాథన్‌కు విరుగాంబాక్కం నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు దళపతి విజయ్. అభ్యర్థుల ప్రకటన సమయంలో శబరినాథన్ పేరు వినబడగానే తండ్రీకొడుకులు ఇద్దరూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. శబరినాథన్ స్టేజీపైనే విజయ్ కాళ్లకు నమస్కరించి, ఆయనను హత్తుకుని వెక్కివెక్కి ఏడ్చారు. తన కోసం మూడు దశాబ్దాలుగా కష్టపడుతున్న వ్యక్తి కుమారుడు అలా కన్నీళ్లు పెట్టుకోవడం చూసి విజయ్ చలించిపోయారు. స్వయంగా తన చేతులతో శబరినాథన్ కన్నీళ్లు తుడిచి అతడిని ఓదార్చారు. ఈ దృశ్యం చూసిన రాజేంద్రన్ కూడా ఆనందబాష్పాలు ఆపుకోలేకపోయారు.

**విశ్వసనీయతకు దక్కిన గౌరవం**

విజయ్ మొదటి సినిమా నుంచి రాజేంద్రన్ ఆయన వద్దే పని చేస్తున్నారు. దాదాపు 30 ఏళ్ల పాటు డ్రైవర్‌గా సేవలందించిన రాజేంద్రన్‌ను విజయ్ తన వ్యక్తిగత సహాయకుడిగా నియమించుకున్నారు. శబరినాథన్ కూడా విరుగాంబాక్కం నియోజకవర్గంలో పార్టీ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. "విశ్వసనీయతకు పట్టం కట్టడం అంటే ఇదే.. తన డ్రైవర్ కొడుకును రాజకీయ నాయకుడిని చేసిన విజయ్ గొప్ప మనసు గలవాడు" అంటూ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు.



రెండు స్థానాల నుంచి విజయ్ పోటీ

మరోవైపు విజయ్ స్వయంగా రెండు నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించారు. "నేను పెరంబూర్, తిరుచిరాపల్లి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నాను. నా పేరు సి. జోసెఫ్ విజయ్ అని నామినేషన్ వేస్తాను" అని విజయ్ పేర్కొన్నారు. ప్రజలతో కలిసి నిలబడే వారినే తాను అభ్యర్థులుగా ఎంపిక చేశానని ఆయన స్పష్టం చేశారు.

# సూర్యా భాయ్ 'గోల్డ్' గుట్టురట్టు

- ఒంటిపై ఉన్నదంతా రోల్డ్ గోల్డే
- ఐటీ అధికారుల షాకింగ్ వెల్లడి
- చికెన్ సెంటర్ యజమాని.. కిలోల కొద్దీ రోల్డ్ గోల్డ్ నగలు

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయపు పన్ను శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సోషల్ మీడియాలో ఆయన ధరించే భారీ గొలుసులు, ఉంగరాలు చూసి విస్తుపోయిన అధికారులు.. అంతటి భారీ మొత్తంలో బంగారం కొనేందుకు ఆదాయ వనరులు ఎక్కడివన్న కోణంలో ఆరా తీయగా ఈ ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిత్యం ఒంటిపై భారీ ఆభరణాలతో కనిపిస్తూ నగరంలో ఒక సెలబ్రిటీలా తిరిగే సూర్యా భాయ్ జీవనాధారంపై ఐటీ అధికారులు దృష్టి సారించారు. ఆయన ఏదో పెద్ద బంగారు వ్యాపారి లేదా రియల్ ఎస్టేట్ దిగ్గజం అని భావించిన వారికి, ఆయన వాస్తవానికి ఒక చికెన్ షాప్ నిర్వహిస్తున్నారని తెలిసి ఆశ్చర్యపోయారు. కేవలం పబ్లిసిటీ కోసం, సోషల్ మీడియాలో ఫాలోయింగ్ పెంచుకోవడం కోసమే ఆయన అతి తక్కువ ధరకు దొరికే రోల్డ్ గోల్డ్ నగలను ధరించి, వాటిని అసలు బంగారంలా ప్రపంచానికి నమ్మించారని అధికారులు అనుమానిస్తున్నారు. గతంలో సూర్యా భాయ్ ఎక్కడకు వెళ్లినా జనం ఆయన చుట్టూ గుమిగూడి సెల్ఫీలు దిగేవారు. కిలోల కొద్దీ బంగారం వేసుకున్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోవడమే కాకుండా, ఆయన భద్రత గురించి కూడా చర్చించుకునేవారు. అయితే, ఐటీ అధికారుల సోదాలు లేదా విచారణ నేపథ్యంలో ఈ 'బంగారు' గుట్టు రట్టయినట్లు సమాచారం. ఆయన ధరించిన నగలు అసలు బంగారమైతే వాటి విలువ కోట్లాది రూపాయల్లో ఉంటుందని, ఒక చికెన్ సెంటర్ నిర్వహించే వ్యక్తికి అంతటి నిధులు ఎక్కడివన్న అనుమానమే ఈ తనిఖీలకు దారితీసింది.

# వాంఖడేలో ముంబై విశ్వరూపం!

- 14 ఏళ్ల 'తొలి మ్యాచ్' శాపం పరార్
- హిట్ మ్యాన్ సునామీ.. రికెల్టన్ విధ్వంసం..
- 221 పరుగుల లక్ష్యం.. చిటికెలో ఛేద్యం
- 300వ మ్యాచ్‌లో అజేయ రికార్డు.. కోల్‌కతా బౌలర్లు బెంబేలు..



**ముంబై, మహా.** అది కేవలం ఒక క్రికెట్ మైదానం కాదు.. భావోద్వేగాల వేదిక. అక్కడ వినిపిస్తున్నది కేవలం ప్రేక్షకుల కేరింతలు మాత్రమే కాదు.. ఒక దశాబ్ద కాలం పైగా వెంటాడుతున్న అపజయాల నీడను చెరిపివేస్తున్న సింహగర్జన. ఐపీఎల్ 2026 సీజన్ ఆరంభ పోరులోనే ముంబై ఇండియన్స్ విశ్వ రూపం ప్రదర్శించింది. గత 14 ఏళ్లుగా ముంబైని పీడిస్తున్న 'తొలి మ్యాచ్' సెంటిమెంట్‌ను వాంఖడే సముద్రపు గాలిలో కలిపేస్తూ, కోల్‌కతా నైట్ రైడర్స్‌పై ఆరు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. పరుగుల వరద పారిన ఈ మ్యాచ్‌లో 221 పరుగుల కొండంత లక్ష్యాన్ని ముంబై బ్యాటర్లు ఆటలాడుకుంటూ ఛేదించడం క్రికెట్ అభిమానులను అబ్బురపరిచింది.

**కేకేఆర్ బ్యాటర్ల మెరుపులు.. రహానే కెప్టెన్ ఇన్నింగ్స్**

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోల్‌కతా బ్యాటర్లు ఆది నుంచే విరుచుకుపడ్డారు. ఓపెనర్ ఫిన్ అలెన్ 17 బంతుల్లోనే 37 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు రాకెట్ వేగాన్ని అందించగా, వెటరన్ ఆటగాడు అజింక్య రహానే తన క్లాస్ ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. 40 బంతుల్లో 67 పరుగులు చేసిన రహానే, యువ ఆటగాడు అంగక్రిష్ రఘువంశీ (51)తో కలిసి ముంబై బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఒక దశలో స్కోరు 240 దాటుతుందనిపించినా, ముంబై బౌలర్ శార్దూల్ ఠాకూర్ తన అనుభవంతో మూడు కీలక వికెట్లు తీసి కేకేఆర్ వేగానికి అడ్డుకట్ట వేశాడు. చివర్లో రింకూ సింగ్ 33 పరుగులతో నాటౌట్‌గా నిలవడంతో కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 220 పరుగుల భారీ స్కోరును సాధించింది.

**రోహిత్-రికెల్టన్ విధ్వంసం.. రికార్డుల వేటలో నీలి దళం**

లక్ష్యం 221 పరుగులు.. గత చరిత్ర చూస్తే ముంబైకి తొలి మ్యాచ్ కలిసిరాదు. కానీ, ఈసారి కథ మారింది. హిట్ మ్యాన్ రోహిత్ శర్మ తన బ్యాట్‌కు పనిచెబితే ప్రపంచంలోని ఏ బౌలర్ అయినా తలవంచాల్సిందేనని మరోసారి నిరూపితమైంది. రోహిత్ శర్మ (78) మరియు దక్షిణాఫ్రికా యంగ్ సెన్సేషన్ ర్యాన్ రికెల్టన్ (81) మైదానంలో పూనకం వచ్చినట్లు ఆడారు. కేవలం 11.5 ఓవర్లలోనే వీరిద్దరూ 148 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కేకేఆర్ ఆశలపై నీళ్లు చల్లారు. రోహిత్ ఆరు ఫోర్లు, ఆరు సిక్సర్లతో విరుచుకుపడగా, రికెల్టన్ ఎనిమిది భారీ సిక్సర్లతో వాంఖడే గ్యాలరీలను హోరెత్తించాడు. రోహిత్ అవుటైన తర్వాత కూడా ముంబై బ్యాటర్లు తడబడలేదు. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ తమ వంతు సహకారాన్ని అందించగా, కెప్టెన్ హార్దిక్ పాండ్యా 18 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును విజయతీరాలకు చేర్చాడు.

**చరిత్ర సృష్టించిన 300వ మ్యాచ్**

ఈ విజయం ముంబై ఇండియన్స్‌కు మరెంతో ప్రత్యేకం. టీ20 క్రికెట్ చరిత్రలో 300 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తొలి ఐపీఎల్ జట్టుగా ముంబై సరికొత్త మైలురాయిని అందుకుంది. ప్రపంచవ్యాప్తంగా పాకిస్థాన్, సోమర్సెట్ జట్ల తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక జట్టుగా ముంబై చరిత్ర పుటల్లోకెక్కింది. ఐపీఎల్‌లో 277 మ్యాచ్‌లు, ఛాంపియన్స్ లీగ్‌లో 22 మ్యాచ్‌ల అనుభవంతో ముంబై ఈ స్థానాన్ని దక్కించుకుంది. మరోవైపు కోల్‌కతా వెటరన్ సునీల్ నరైన్ 190వ మ్యాచ్ ఆడి, ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన విదేశీ ఆటగాడిగా కీరన్ పొలార్డ్ రికార్డును బద్దలు కొట్టాడు.

**మారిన ముంబై వ్యూహం**

ముంబై విజయంలో కీలక పాత్ర పోషించింది వారి పవర్ ప్లే బ్యాటింగ్. కేవలం ఆరు ఓవర్లలోనే 80 పరుగులు రాబట్టడం ద్వారా కేకేఆర్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని ముంబై దెబ్బతీసింది. శార్దూల్ ఠాకూర్ బౌలింగ్ మార్పులు మరియు ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్స్ విషయంలో హార్దిక్ పాండ్యా తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిచ్చాయి. అజింక్య రహానే గాయపడి మైదానాన్ని వీడటం కేకేఆర్‌కు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. రింకూ సింగ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించినా, రోహిత్-రికెల్టన్ జోడీని అడ్డుకోవడంలో విఫలమయ్యాడు. ముంబై యువ బౌలర్ అల్లా ఘజన్‌ఫర్ అరంగేట్రం మ్యాచ్‌లోనే ఆకట్టుకోగా, బ్యాటింగ్ విభాగం అసాధారణ ఫామ్‌లో ఉండటం ఈ సీజన్‌లో ముంబైని ఫేవరెట్‌గా నిలబెడుతోంది. మొత్తానికి 14 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ, వాంఖడే గడ్డపై ముంబై ఇండియన్స్ ఒక నవశకాన్ని ప్రారంభించింది. ఈ విజయం ముంబై అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, రాబోయే మ్యాచ్‌లకు ప్రత్యర్థులకు బలమైన హెచ్చరిక పంపింది.

**నమోదైన అరుదైన రికార్డులు**

ఈ మ్యాచ్ కేవలం ఒక విజయం మాత్రమే కాదు, రికార్డుల పుటల్లో కొత్త అధ్యాయాలను లిఖించింది: శాపం విముక్తి: గత 14 ఏళ్లుగా (2013 నుండి 2025 వరకు) ప్రతి సీజన్ తొలి మ్యాచ్‌లో ఓడిపోతున్న రికార్డును ముంబై ఎట్టకేలకు బ్రేక్ చేసింది.

**ముంబై @300**

టీ20 క్రికెట్ చరిత్రలో 300 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తొలి ఐపీఎల్ జట్టుగా ముంబై అరుదైన ఘనత సాధించింది (ఐపీఎల్: 277, ఛాంపియన్స్ లీగ్: 22, ప్రస్తుత మ్యాచ్:

**నరైన్ నయా రికార్డ్**

ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన విదేశీ ఆటగాడిగా సునీల్ నరైన్ (190 మ్యాచ్‌లు) నిలిచాడు. తద్వారా కీరన్ పొలార్డ్ (189) రికార్డును అధిగమించాడు.

**రికార్డ్ భాగస్వామ్యం**

రోహిత్ రికెల్టన్ జోడీ మొదటి వికెట్‌కు కేవలం 71 బంతుల్లోనే 148 పరుగులు జోడించి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు.

# యుద్ధం ఏదైనా.. ఐక్యంగా ఎదుర్కొందాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్నది నిస్సందేహంగా సవాల్‌తో కూడిన సమయమేనని, అయితే భారతీయుల ఐక్యత ముందు ఏ సంక్షోభమైనా చిన్నబోవాల్సిందేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. విపత్కర పరిస్థితులు నెలకొన్న తరుణంలో దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని, వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమాసియా ప్రాంతం ప్రపంచ ఇంధన అవసరాలకు ప్రధాన వనరు అని, అక్కడ జరుగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తలెత్తినప్పటికీ, గత కొన్ని దశాబ్దాలుగా భారత్ ఇతర దేశాలతో నిర్మించుకున్న బలమైన దౌత్య సంబంధాలు ఇప్పుడు రక్షణ కవచంలా పనిచేస్తున్నాయని వివరించారు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ పూర్తి నిబద్ధతతో సిద్ధంగా ఉందని, ఇతర దేశాల సహకారం వల్ల మన దేశం సుస్థిరమైన స్థితిలో ఉందని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రతపై ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత్‌కు సమీపంలోనే గత నెల రోజులుగా భీకర యుద్ధం జరుగుతుండటం ఆందోళనకరమని, గల్ఫ్ దేశాల్లో స్థిరపడిన కోటి మందికి పైగా భారతీయుల క్షేమం కోసం వారి కుటుంబ సభ్యులు ఇక్కడ వేచి చూస్తున్నారని ఆయన అన్నారు. ఈ విపత్కర సమయంలో అక్కడ నివసిస్తున్న భారతీయులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూ, వారిని కంటికి రెప్పలా కాపాడుతున్న గల్ఫ్ దేశాల ప్రభుత్వాలకు ప్రధాని మోదీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఆయా దేశాల నాయకత్వం ప్రదర్శించిన చొరవ, భారతీయుల పట్ల వారు చూపిస్తున్న ఆదరణ మరువలేనిదని ఆయన కొనియాడారు. యుద్ధం వల్ల తలెత్తే ఆర్థిక, సామాజిక పరిణామాలను తట్టుకునే శక్తి భారత్‌కు ఉందని, ఈ గడ్డు కాలాన్ని దాటి దేశం మరింత దృఢంగా ముందుకు సాగుతుందని మోదీ ఆకాంక్షించారు. దేశ ప్రజలందరి సంక్షేమమే తన ప్రథమ ప్రాధాన్యమని, అంతర్జాతీయ వేదికలపై భారత్ తన గళాన్ని శాంతి కోసం వినిపిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో భారతీయులంతా ఒకరికొకరు తోడుగా ఉంటూ, దేశ సమగ్రతను చాటి చెప్పాలని ప్రధాని మోదీ తన ప్రసంగం ద్వారా సందేశాన్ని ఇచ్చారు.

# తల్లిదండ్రుల సంరక్షణకు చట్టబద్ధమైన భరోసా

- భక్తి లేనివారికి భయం కలిగించేందుకే ఈ చట్టం
- కన్నవారిని రోడ్డున పడేస్తే ఊరుకోం: సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్, మహా.** ఈ సమాజంలో ఏ కుటుంబంలోనూ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదన్న పవిత్ర సంకల్పంతోనే తమ ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకువస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం శాసనసభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రవేశపెట్టిన "తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు 2026"పై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా ప్రసంగించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ఒక సామాజిక అవసరమని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రుల పట్ల భక్తి లేని వారికి భయం కలిగించేందుకే ఈ చట్టాన్ని రూపొందించామని, ఇది వృద్ధుల రక్షణ దిశగా ఒక చారిత్రక ముందడుగు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. నేటి ఆధునిక సమాజంలో మనిషి బంధాలు, అనుబంధాలను విస్మరించి కేవలం భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాల కోసం పాకులాడుతున్నాడని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కన్నవారిని రోడ్డున పడేసి ఆస్తుల కోసం కొట్లాడుకునే పరిస్థితులు రావడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. రాజ్యాంగంలో పిల్లల కోసం ఆర్టికల్ 21(ఏ), ఆర్టికల్ 24 వంటి అనేక రక్షణలు ఉన్నాయని, అలాగే మహిళల కోసం నిర్భయ, పోక్సో, గృహ హింస నిరోధక చట్టాలు వంటి అనేక పటిష్టమైన చట్టాలు అమల్లో ఉన్నాయని గుర్తు చేశారు. దేశంలో 2007 నుంచే వృద్ధుల సంరక్షణ చట్టం ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులపై జరుగుతున్న వివక్ష, నిర్లక్ష్యం తగ్గడం లేదని, అందుకే మరింత జవాబుదారీతనంతో కూడిన ఈ నూతన బిల్లును ప్రవేశపెట్టామని వివరించారు.

సభలో మాతృ పితృ భక్తి ప్రాముఖ్యతను వివరిస్తూ ముఖ్యమంత్రి శ్రవణ కుమారుడి పురాణ గాథను ప్రస్తావించారు. ప్రతి బిడ్డ శ్రవణ కుమారుడిని ఆదర్శంగా తీసుకుంటే అసలు ఇటువంటి చట్టాల అవసరమే ఉండదని వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంలో ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, రేమండ్స్ మాజీ అధినేత విజయ్ పథ్ సింఘానియా జీవితంలో ఎదురైన విషాదాన్ని ఆయన గుర్తు చేశారు. వేల కోట్లు ఆర్జించి పద్మభూషణ్ అవార్డు పొందిన వ్యక్తి, తన ఆస్తి మొత్తాన్ని కుమారుడికి ధారాదత్తం చేసిన తర్వాత సొంత ఇల్లు కూడా లేక అద్దె ఇంట్లో ఉండాల్సిన దయనీయ స్థితిని సీఎం వివరించారు. సింఘానియా తన ఆత్మకథ 'యాన్ ఇంకంప్లీట్ లైఫ్ 'లో వ్యక్తం చేసిన ఆవేదన సమాజంలోని చీకటి కోణానికి నిదర్శనమని సభ దృష్టికి తీసుకువచ్చారు.

మారుతున్న కుటుంబ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబాలు అంతరించిపోవడంతో వృద్ధులు మరింత ఒంటరివారవుతున్నారని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ప్రజాప్రతినిధి తన తండ్రికి క్యాన్సర్ సోకినా చికిత్స అందించకుండా నిర్లక్ష్యం వహించిన ఉదంతాన్ని ఆయన ఉదాహరణగా చెప్పారు. కన్నవారిని చూసుకోలేని వారిని సమాజం బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ చట్టం కేవలం ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకే కాకుండా, ప్రజాప్రతినిధులకు కూడా వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ బిల్లు ద్వారా వృద్ధ తల్లిదండ్రులకు తమ బిడ్డలు తమను చూసుకుంటారనే భరోసా కలుగుతుందని, సామాజిక బాధ్యతతో కూడిన ఈ బిల్లును అన్ని పక్షాలు ఏకగ్రీవంగా ఆమోదించి సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## ఉపసర్పంచ్ గుండె వెంకన్న చేతుల మీదుగా
# నూతన విద్యుత్ లైన్ ప్రారంభోత్సవం

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని గౌతమిపురం ప్రాంతంలో కొంతకాలంగా 'లో వోల్టేజ్' సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో గృహ అవసరాలు, వ్యవసాయ పనులు అంతరాయం కలిగిన నేపథ్యంలో స్థానిక ప్రజలు సమస్య పరిష్కారం కోసం పలుమార్లు అధికారులను ఆశ్రయించారు. ఈ సమస్యను గుర్తించిన విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకొని నూతన ట్రాన్స్‌ఫార్మర్ లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. లైన్ సక్రమంగా పనిచేసేలా సాంకేతిక సిబ్బంది కృషి చేయడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం అయినది ఆదివారం నాడు ఈ నూతన విద్యుత్ లైన్‌ను బూర్గంపహాడ్ ఉపసర్పంచ్ గుండె వెంకన్న చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం లైన్‌ను ఆన్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో బూర్గంపహాడ్ విద్యుత్ కార్యాలయం ఫోర్‌మెన్ ఆదినారాయణ, లైన్‌మెన్ జిలానీతో పాటు వారి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కొత్త లైన్ ప్రారంభంతో గౌతమిపురం ప్రాంత ప్రజలకు విద్యుత్ సమస్యలు తీరాయి

# అశ్వాపురంలో టీడీపీ ఘనంగా 44వ ఆవిర్భావ వేడుకలు..

**అశ్వాపురం /మణుగూరు, మహా :** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని అశ్వాపురం మండల కేంద్రంలో ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి ఉత్సాహంగా వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు, మేజర్ గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాష్ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కేవలం రాజకీయ వేదిక మాత్రమే కాకుండా కోట్లాది తెలుగు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రజల్లోకి వెళ్లిన తీరు భారత రాజకీయాల్లో అరుదైన ఘట్టమని అన్నారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించాలనే ఎన్టీఆర్ సిద్ధాంతాలను పార్టీ నేటికీ పాటిస్తున్నదని, టీడీపీ ఆవిర్భావం తర్వాతే అణగారిన, బడుగు, బలహీన



వర్గాలకు రాజకీయ, సామాజిక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. దేశానికి సంక్షేమ పథకాల భావనను పరిచయం చేసిన పార్టీ తెలుగుదేశమేనని అన్నారు. పార్టీ కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవం అంటే ఇంటి పండుగలాంటిదని, ప్రతి కార్యకర్తకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తుళ్లూరి గంగా భవాని, కంసాని సురేష్, టీడీపీ వాసు, రాయల అరుణ, ఆచంట అనిత, సాయి ప్రకాష్, కొర్లకుంట శ్రీనివాస్, మల్లెల రమణ, త్రివేణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ – నవభారత సాక్షారత పరీక్షలు..

**పాల్గొన్న ఉప సర్పంచ్ గాండ్ల సురేష్..**

**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ - నవభారత సాక్షరత మూల్యాంకన పరీక్షా కార్యక్రమాలు మణుగూరు మండలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ పాల్గొన్నారు. మండలంలోని సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని 1వ వార్డు, వాగు మల్లారం, అశోక్ నగర్ ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న విఓఏ కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. వయోజనులకు విద్య అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు, నాయకులు సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా గాండ్ల సురేష్ మాట్లాడుతూ వయోజనులకు సాక్షరత కల్పించడం సమాజాభివృద్ధికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విఓఏలు వరలక్ష్మి, తంగేళ్ల పద్మ, ఓబీ శ్యామలతో పాటు కాంగ్రెస్ పార్టీ



నాయకులు బొజ్జ త్రిమూర్తులు, ఎండి యాకూబ్ అలీ, ద్వాలి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు..

**వాడవాడలో రెపరెపలాడిన పచ్చ జెండా..**

**మణుగూరు, మహా :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో పచ్చ జెండా ఆవిష్కరణలు, నాయకుల చిత్రపటాలకు పూలమాలలు, నివాళులు, సమావేశాలతో వేడుకలు సందడిగా సాగాయి. ఈ సందర్భంగా సమితి సింగారం కూడలి వద్ద మాజీ సర్పంచ్ బచ్చల భారతి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట రహదారి ప్రక్కన టిడిపి అడహాక్ కమిటీ సభ్యులు వట్టం నారాయణ దొర జెండా ఎగురవేశారు. అంబేద్కర్ సెంటర్‌లో అడహాక్ కమిటీ సభ్యులు వాసిరెడ్డి చలపతిరావు జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పూల మార్కెట్ సెంటర్‌లో చిర్రా రవి, కొండ్రు అశోక్ ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ స్థాపకుడు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ ఆవిర్భావ లక్ష్యాలు, సిద్ధాంతాలను గుర్తుచేసుకున్నారు. మణుగూరు పట్టణం మొత్తం పచ్చ జెండాలతో



కళకళలాడింది. వాడవాడలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని నినాదాలతో కార్యక్రమాలను ఉత్సవంలా నిర్వహించారు. ఈ వేడుకల్లో వట్టం నారాయణ దొర, వాసిరెడ్డి చలపతిరావు, మల్లెడి లోకేష్, పూర్ణ, మద్దెల భద్రయ్య, సత్యనారాయణ, హరి, చిర్రా రవి, కొండ్రు అశోక్, యార్లగడ్డ రాజా, బచ్చల సుమేష్, దండమూరి రాంబాబు, ఉప్పలపాటి రాంబాబు, సూరిబాబు, ఆంజనే, ఆంజనేయులు, భావసింగ్, తాతా రామయ్య, మేదరమట్ల నాగేశ్వరరావు, ముమ్మనేని సత్యనారాయణ, పసునూరి చంద్రరావు, మాజీ సర్పంచ్ బచ్చల భారతి, చావా శ్రీదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా మణుగూరులో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలు ఉత్సాహభరితంగా సాగి పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

# యుద్ధ వ్యతిరేక శాంతి ర్యాలీని జయప్రదం చేయండి..

**అఖిలపక్ష నేతల పిలుపు..**

**మణుగూరు, మహా :** మణుగూరులో ఏప్రిల్ 4న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న యుద్ధ వ్యతిరేక శాంతి ర్యాలీని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మణుగూరులోని స్నేహ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో వారు ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా ప్రపంచ నియంతలా వ్యవహరిస్తూ ప్రపంచ వనరులపై ఆధిపత్యం కోసం ఆయిల్ నిక్షేపాలు ఉన్న దేశాలపై దాడులు చేస్తోందని విమర్శించారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలు, ఐక్యరాజ్య సమితి నిబంధనలను ధిక్కరిస్తూ గతంలో ఇరాక్, వెనుజులా దేశాలపై దాడులు జరిపిందన్నారు. ప్రస్తుతం ఇజ్రాయిల్ తో కలిసి ఇరాన్ పై యుద్ధం కొనసాగిస్తూ ప్రజల ప్రా



ణాలను బలిగొంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ ప్రభావం ప్రపంచ దేశాలపై మాత్రమే కాకుండా భారతదేశం పై కూడా పడుతుందని పేర్కొన్నారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ కొరతను సృష్టించి ధరలు పెంచడం ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. యుద్ధం కొనసాగితే అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడి జీవితం మరింత దుర్భరమవుతుందని హెచ్చరించారు. అందువల్ల యుద్ధాన్ని వ్యతిరేకించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఏప్రిల్ 4న మణుగూరులో జరిగే శాంతి ర్యాలీలో ప్రజలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# అండర్ టేనల్ నిర్మాణం చేయాలి

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**

**కారేపల్లి, మహా:** సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన కారేపల్లి చీమలపాడు, పాపకొల్లు గుట్టల్లో అండర్ టేనల్ నిర్మాణం పనులు ప్రారంభం చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రైతు సంఘం బృందం చీమలపాడు వద్ద అండర్ టేనల్ నిర్మాణం చేయాల్సిన ప్రాంతంలో గుట్టలను జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించింది. అఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా లో కామేపల్లి, కారేపల్లి రఘునాధపాలెం, ఖమ్మం రూరల్, తిరమలాయపాలెం ,కుసుమంచి మండలాల్లో భూములకు సాగునీరు అందించటం తోపాటు, నాగార్జున సాగర్ ఆయకట్టు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన ప్రధాన పనులు లో కారేపల్లి మండలం చీమలపాడు జూలూరుపాడు మండలం పాపకొల్లు గుంటల్లో అండర్ టేనల్ నిర్మాణం పనులు ప్రారంభం చేయాలి అని అన్నారు. ప్రభుత్వం మాత్రం దీర్ఘ కాలం పట్టే పనులు ప్రారంభం చేయకుండా కేవలం మట్టి కాలువలు త్రవ్వకం చేయడం ఆశ్చర్య పరుస్తుంది అని అన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం అండర్ టేనల్ నిర్మాణం చేయాలి ఉంది అని అన్నారు, ఉమ్మడి ఖమ్మం జిల్లా లో ఏడు లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా కేవలం మూడు



వందల ముప్పై ఆరు కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని బడ్జెట్ ప్రతిపాదనలు సవరించి కేటాయింపులు పెంచాలి అని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా లో ఉన్న ముగ్గురు మంత్రులు నియోజకవర్గాల్లో సాగు భూములకు సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా గోదావరి జలాల అందించే అవకాశం ఉందని అన్నారు. ముగ్గురు మంత్రులు భాధ్యత వహించి సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండేబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కాలువలు నిర్మాణం కోసం భూ సేకరణ లో రైతులకు వేరు వేరు గా భూములు ధరలు నిర్ణయం చేసి పరిహారం అందించడం సరి కాదని భూములు కోల్పోయిన రైతులకు ఎలాంటి తారతమ్యం లేకుండా ఎకరాకు ఇరవై ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, రైతు సంఘం నాయకులు మద్దెల నాగయ్య, ఎర్రిపోతు భద్రయ్య, సూరపాక ధనమ్మ, దారవత్ వినోద్, మాడపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# కార్మికుల సంక్షేమపై సింగరేణి నిర్లక్ష్యం

**సీఐటీయూ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సింగరేణి యాజమాన్యానికి పలుమార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఇది సరైనది కాదని సీఐటీయూ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.మధు అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కా



ర్మికులతో పాటుగా రాష్ట్రంలో ఉన్న కార్మికులంతా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే భవిష్యత్ కార్యక్రమాలకి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో స్కీమ్ వర్కర్లు గ్రామ పంచాయితీ బిల్డింగ్ వర్కర్లకు ఎన్నికలముందు ఇచ్చిన హామీలను అమలు చేయమంటే ప్రభుత్వం అరెస్టులుచేసి నిర్బంధం ప్రయోగిస్తుందని ఈ నిర్బంధాలు ఆపకపోతే ప్రభుత్వం తగినమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26000 చెల్లించాలని బిల్డింగ్ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రైవేటీకరణ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయడం సిగ్గుచేటని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కార్మికులకు ఎటువంటి న్యాయం జరగకపోగా అసలు కాంట్రాక్టు కార్మికుల లేరని ఒక పైసా జీతం పెంచకుండా కాలయాపన చేసిన తెరాస రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర కార్మికులు తగిన గుణపాఠం చెప్పి అధికారం నుండి దించిన సంగతిని గుర్తు చేశారు. హామీలు అమలు చేయకపోతే కార్మిక వర్గ శక్తి ఏమిటో భవిష్యత్తులో నిరూపించాల్సిన పరిస్థితి ఏర్పడే దాకా తెచ్చుకోవద్దని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న స్కీం వర్కర్లు కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసే విధంగా అసెంబ్లీలో తీర్మానము చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజె.రమేష్, కోశాధికారి జిలకర పద్మ, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఈశం వెంకటమ్మ, అబ్దుల్ నభి, పిట్టల అర్జున్, కె.సత్య, భూక్యా రమేష్, ధనలక్ష్మి, గద్దల శ్రీను తదితరులు పాల్గొన్నారు.





# ఆటో బోల్తా
# ఆరుగురికి గాయాలు

**కారేపల్లి, మహా:** సింగరేణి మండల పరిధిలోని జమ్మలపల్లిలో ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలు కాగా అందులో ఇద్దరికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..పేరేపల్లి గ్రానికి చెందిన వజ్జ సునీల్ (25) సరదాగా ఆరుగురు చిన్న పిల్లలను ఆటో ఎంకించుకొని పేరేపల్లి నుండి ఎల్లందు వైపు వెళుతుండగా మధ్యలో మరొక బాలుడుకి ఆటో తొలమని ఇవ్వగా ఆ బాలుడు ఆటో తోలుతూ ఉండగా ఒక్కసారిగా అదుపు తప్పి ఆటో బోల్తా పడింది... ఈ ప్రమాదంలో పేరేపల్లి గ్రామానికి చెందిన పులసం యశ్వంత్, అలెం స్నేహితు,దనసరి భారత్,అలెం తేజ,అలెం చిట్టు,దనసారి ప్రవీణ్ లకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. పులసం యశ్వంత్, అలెం స్నేహితు కి సీరియస్ గా ఉన్నట్లు సమాచారం...



# రాజస్థానీ హిందీ సాహిత్యాల స్త్రీవాద రచయిత్రి - జర్నలిస్ట్ తస్నీమ్ ఖాన్

భారతీయ సాహిత్యంలో కొన్ని రచనలు సమస్యలను ఎత్తిచూపగా ఇంకొన్ని ఎదిరించినవి,అలాగే సమస్యల పరిష్కారాన్ని అన్వేషించినవి మరికొన్ని.అవి తడితడిగా గుండెను తడిమితే వెచ్చగా సమాజాన్ని తట్టి లేపుతాయి. సమాజ హితమే సాహిత్య పరమావధిగా భావిస్తే ఆ కోవలో రాజస్థాన్ ఎడారి జీవితాలపై కథలు రాసిన రాజస్థానీ పత్రికా సంపాదకురాలు,ప్రముఖ రచయిత్రి తస్నీమ్ ఖాన్ ఉన్నారు.

అయితే జీవనయానంలో మొత్తంగా మనుషులకు అందులోనూ 'ఆకాశంలో సగం' అనబడే మహిళలకు దారులు ఎప్పుడూ సులభం కాలేదనేది జగమెరిగిన సత్యమే. కానీ ఆశ ,ఆసక్తి, తపన,సాధన సంకల్పం గల వారిలోని కోరిక బలమైన అడుగులేస్తూ చేసే ప్రయత్నమే విజయాన్ని అందిస్తుందని కదా చరిత్రపాఠం.ఆ దారిలోనే తన గమ్యాన్ని చేరిన తస్లీమ్ ఖాన్ రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలోని దిద్వానా తహసీల్.



తస్నీమ్ ఖాన్

నుండి వచ్చిన ఆమె ఒక చిన్న ఇంట్లో పెరిగిన చదువు, సంస్కృతి ఉండేది. చదువుకున్న తల్లిదండ్రులు, మరింకా ఆమె తల్లికి పుస్తకాల పట్ల ఉన్నఅమిత ప్రేమ తస్నీమ్ ను చక్కగా తీర్చిదిద్దింది. పుస్తకాల మధ్య పెరిగిన తనలో ఆలోచన, చర్చించే తార్కిక సామర్థ్యం పదునెక్కింది. ఆమె ఇల్లు,బడి వాతావరణమే ఆమెకు అనేక అవార్డులను తెచ్చిపెట్టింది.

ఆమె హిందీ సాహిత్యంలో సాహిత్య రచనలలో నా గైడ్ (మేరే రెహ్నుమా) ఆమె తొలి నవల.ఆ గ్రంథాన్ని 2015లో జ్ఞానపీఠ్ ట్రస్ట్ ప్రచురించింది. ఇది అవాంట్ గార్డ్ యువ రచయితల పోటీలో ఎంపికైన ఆర్థిక స్వాతంత్ర్యం మాత్రమే మహిళల సాధికారతను నిర్ధారించదని హైలైట్ చేసిన గొప్ప రచన.అలాగే బవిలిస్తాన్ రాజస్థాన్ ఎడారి జీవితంలోని సంస్కృతి మరియు పోరాటాలలో లోతుగా పాతుకుపోయిన కథల సంకలనం.

దస్తాన్ఎహ్రజత్ మహల్ 2019లో చంద్రబాయి అవార్డు అందుకున్న చిన్న కథల సంకలనం.

హమ్నావై నా థి 2024లో సాహిత్యం, కల్పనలతో వచ్చిన మరొక రచన.

ఆమె రాసిన ఇతర కథలు, రచనలు తరచుగా పాఖీ మరియు మీమాన్స వంటి సాహిత్య పత్రికలలో ప్రచురితమవుతాయి. రుఖ్ఎగుల్జార్ మరింకా ఖామోషియోంకా రంగ్ నీలా వంటి కథలు ఉర్దూతో సహా ఇతర భాషలలోకి అనువదించబడ్డాయి. జర్నలిస్టిక్,థీమాటిక్ ఫోకస్ లో భాగంగా ఆమె రాజస్థాన్ పత్రికా గ్రూపులో సీనియర్ సబ్ఎడిటర్‌గా పనిచేస్తూ మహిళల సామాజిక, రాజకీయ ఆందోళనలను హైలైట్ చేయడానికి తన వేదికను ఉపయోగించారు.

ఆమె తన సాహిత్య,పాత్రికేయ రంగాలలో కృషికి మంచి గుర్తింపు లభించింది. అందులో రాజస్థాన్‌లోని ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ శకుంతలం అవార్డ్ 2021లో అందుకున్నది. అలాగే జర్నలిజంలో పండిట్ ఝబర్మల్ స్మృతి అవార్డ్ మూడు సార్లు అందుకున్నారు.మరింకా లాడ్లీ మీడియా అవార్డును తన "గృహ హింస ఎప్పుడు లాక్‌డౌన్‌లోకి వెళుతుంది?" అనే ఆమె టెలివిజన్ షోకు గుర్తింపుగా పొందింది.

రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలోని దిద్వానాకు అనే చిన్న పట్టణం నుండి జాతీయ వేదిక వరకు ఎదిగిన ఒక ముఖ్యమైన రచయితగా గుర్తింపు పొందిన తస్నీమ్ ఖాన్ రాజస్థాన్‌కు చెందిన హిందీ నవలా రచయిత్రి, సీనియర్ జర్నలిస్ట్,అవార్డ్ గ్రహీత కూడా. ఆమె మహిళా సాధికారత, సామాజిక సమస్యలు మరియు థార్ ఎడారిలోని జీవిత సంక్లిష్టతలపై దృష్టి సారించే ఆమె హృదయ స్పర్శ సాహిత్యానికి గుర్తింపు పొందారు. ఆమె పితృస్వామ్యాన్ని సవాలు చేయడానికి మరి సమకాలీన జీవితంలోని మానసిక, సామాజిక అంశాలను, ముఖ్యంగా మహిళల కోసం అన్వేషించడానికి తన రచనలను ఉపయోగించే రచయిత్రిగా ప్రసిద్ధి చెందారు. రాజస్థానీ హిందీ సాహిత్యాల వెలుగు, పాత్రికేయంలో వేగుచుక్క, గొప్ప రచనలతో వెలిగే తస్నీమ్ ఖాన్ ఓ స్త్రీవాద సామాజిక దీపదారి.

**డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
**9849305871**

# గిరిజకుమార్ బాలియార్ సింగ్

**ఈ చౌరస్తాలో అరబ్బీ చీకట్లు కమ్మకపోయినా పర్వాలేదు,**
**కానీ ఇక్కడి ఈద్ చంద్రుడు ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు?**
**ఓ బేగం సాహెబా! కాసేపు ఎదురెదురుగా కూర్చుని నవ్వుతూ మాట్లాడుకుందాం,**
**ఇంక్విలాబ్ పుట్టిన ఈ తేదీన ఆ మూడు నక్షత్రాలను ఉదయించనివ్వు!**
**ఆ దారి పక్కన ఉన్న కుళాయి దగ్గర దాహం ఇంకా తీరలేదు,**
**ఈ చలి రాత్రిని గడపడానికి ఒక కప్పు కాఫీని ఇద్దరం పంచుకుందాం!**
**గతంలోని ఆస్తుల పంపకాల్లో ఎన్నో హంసల (ప్రాణాల) నష్టం జరిగింది...**
**గడిచిపోయిన ఆ అల్లర్ల గ్లానిని, ఆ పుకార్లను మళ్ళీ తవ్వుకోవద్దు!**

**మరో దిశలో దిగంతం ఎక్కడైతే కలిసిపోతున్నట్లు అనిపిస్తుందో,**
**నిజంగా అక్కడే ఎక్కడో 'దీన్ఇఇలాహీ' రోజులు కన్నీరు పెడుతున్నాయా?**
**పిచ్చి గాలికి నీ నకాబ్ ఎగిరిపోతుంటే, ఎగిరిపోనివ్వు...**
**బహుశా దీని తర్వాత మళ్ళీ ఎప్పుడూ ఇలా కలుసుకోవడం జరగకపోవచ్చు!**
**తెల్లవారితే నువ్వు ఫరీదాబాద్‌కు తిరిగి వెళ్ళిపోతావని నాకు తెలుసు,**
**కానీ టికెట్ లేని నా ఈ రైలు ప్రయాణానికి ఇంకాస్త సమయం ఉంది.**

(పాద పూరణ నుండి)

ఈ కవిత ఈద్ పండుగను కేవలం ఒక మతపరమైన వేడుకగా మాత్రమే చూడకుండా , మానవ సంబంధాలు, సామాజిక మార్పు తో పాటు జీవితంలోని అనిశ్చితిని ప్రతిబింబించే ఒక అద్భుతమైన వేదికగా మలిచింది. కవి ఈ కవితలో అరబ్బీ దేశాల చీకటి ప్రభావం ఇక్కడ లేకపోయినా, ఈద్ చంద్రుడు అందరికీ అత్యంత ప్రియమైనవాడు అని చెప్పడం ద్వారా ప్రేమ,శాంతి భావనల సార్వజనీనతను చాటి చెప్తుతున్నాడు. విప్లవ ఆవిర్భావాన్ని (ఇంక్విలాబ్) సూచించే ఈ ప్రత్యేక తేదీన, పాత పద్ధతులను పక్కన పెట్టి కొత్త ఆశల నక్షత్రాలు ఉదయించాలని కవి కోరుకుంటున్నాడు. ముఖ్యంగా గతంలో జరిగిన అల్లర్లు, వదంతులు వాటివలన జరిగిన ప్రాణనష్టాల వంటి చేదు జ్ఞాపకాలను నెమరువేసుకోవడం కంటే, వర్తమానంలో ఎదురెదురుగా కూర్చుని ఒక కప్పు కాఫీని పంచుకుంటూ ప్రేమగా మాట్లాడుకోవడం మిన్న అని కవి అన్యాపదేశంగా సమాజం దేన్నీ గుర్తుపెట్టుకోవాలో చెపుతున్నారు . అక్బర్ చక్రవర్తి ప్రవేశ పెట్టిన మత సామరస్య సూత్రం 'దీన్ఇఇలాహీ' నేడు దిగంతాల్లో ఎక్కడో కన్నీరు పెడుతోందని అనడం ద్వారా, ప్రస్తుత సమాజంలో కరువవుతున్న సహనాన్ని కవి ప్రశ్నించారు. కవిత ముగింపులో కనిపించే వీడ్కోలు దృశ్యం ఎంత హృదయ విదారకంగా వుంది? గాలికి ఎగిరిపోయే ముసుగు (నకాబ్) స్వేచ్ఛకు ప్రతీకగా నిలుస్తుండగా, మళ్ళీ కలుస్తామో లేదో తెలియని ఒక అనిశ్చితి అక్కడ కనిపిస్తుంది. అన్నిటికంటే బలమైన రూపకం 'టికెట్ లేని రైలు ప్రయాణం'. అవతలి వ్యక్తికి ఫరీదాబాద్ అనే ఒక నిర్దిష్ట గమ్యం ఉన్నప్పటికీ, కవికి మాత్రం తన జీవితాన్ని టికెట్ లేని, గమ్యం తెలియని ఒక ప్రయాణంగా అభివర్ణించుకున్నారు. ఇది మనిషి అశాశ్వతత్వాన్ని, సామాజిక అస్తిత్వ వేదనను కాల ప్రవాహంలో కొట్టుకుపోయే నిస్సహాయతను ఒకేసారి ఆవిష్కరిస్తుంది. ఈద్ నేపథ్యంతో మొదలై, మానవ వేదననిండిన తాత్విక చింతనతో ముగిసిన ఈ కవిత పేరు ఈద్ :మరో కథ .

ఈ కవిత రాసిన ప్రముఖ ఒడియా గిరిజన కవి గిరిజకుమార్ బాలియార్ సింగ్ తన "పాదపూరణ" కవిత్వ సంపుటికి గాను 2025 వ సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గెలుచుకున్నారు. పాదపూరణ అనేది 150 సానెట్ల సంకలనం. దీనిలోని సాహిత్య లోతు, సృజనాత్మక వ్యక్తీకరణ ఒడియా సాహిత్య లోకాన్ని విపరీతంగా ఆకర్షించింది. మనిషి అంతరంగాన్ని, సమాజంలోని వైరుధ్యాలను, కాల ప్రవాహంలో కొట్టుకుపోయే స్మృతులను అత్యంత సున్నితంగా ఆవిష్కరించిన ఒక అద్భుత కావ్యం ఇది. 'పాదపూరణ' శీర్షికలోనే ఒక లోతైన తాత్వికత దాగి ఉంది. సాధారణంగా పద్య సాహిత్యంలో అసంపూర్ణంగా ఉన్న పాదాన్ని పూర్తి చేయడాన్ని పాదపూరణ అంటారు, కానీ కవి ఇక్కడ ఈ పదాన్ని జీవితానికి అన్వయించారు. మనిషి తన జీవిత ప్రయాణంలో వదిలివేసిన కోరికలు, సగం చదివిన పుస్తకాలు, అర్థాంతరంగా ఆగిపోయిన బంధాలు నెరవేరని కలలను అక్షర రూపంలో పూరించడమే ఈ కవితా సంకలనంలోని ప్రధాన ఉద్దేశ్యం.

బలియార్ సింగ్ గారి కవిత్వంలో ఒక రకమైన నిశ్శబ్దంగా ధ్వనించే వేదన, అదే సమయంలో ఒక గొప్ప ఆశావహ దృక్పథం అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటాయి. ఈ సంకలనంలోని కవితలు పాఠకుడిని వర్తమానం నుండి గతం వైపుకు, గతం నుండి ఒక అందమైన భవిష్యత్తు వైపుకు నడిపిస్తాయి. కవి తన కవిత్వంలో వాడిన భాష అత్యంత సరళంగా ఉంటూనే, పాఠకుడి గుండె లోతుల్లోకి చొచ్చుకుపోయేంత శక్తిని కలిగి ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ ఒడిశా జీవన శైలిని, అక్కడి ప్రకృతిని, మనుషుల మధ్య ఉండే స్వచ్ఛమైన అనురాగాలను ఆయన తన కవితల్లో పదిలపరిచారు.

2020 ప్రాంతంలో వెలువడిన ఈ రచనలో ఆనాటి సామాజిక అస్థిరత, వలస జీవుల కష్టాలు మారుతున్న మానవ విలువల పట్ల కవి ఆవేదన స్పష్టంగా కనిపిస్తుంది. పెయిన్ ఉదహరించిన 'ఈద్' వంటి కవితలో పండుగ సంబరాల కంటే కూడా, విడిపోతున్న ఇద్దరు




వ్యక్తుల మధ్య ఉండే మౌన సంభాషణను, గమ్యం తెలియని జీవిత ప్రయాణాన్ని 'టికెట్ లేని రైలు ప్రయాణం' వంటి శక్తివంతమైన రూపకాలతో వర్ణించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. దేశ విభజన నాటి గాయాలను, మత సామరస్యం కోసం పరితపించిన 'దీన్ఇఇలాహీ' వంటి చారిత్రక అంశాలను నేటి కాలానికి అన్వయిస్తూ ఆయన చేసిన విశ్లేషణ అద్భుతం.

బలియార్ సింగ్ గారి కవిత్వంలో ప్రకృతి కేవలం ఒక అలంకారం కాదు, అది మనిషి సుఖదుఃఖాల్లో పాలు పంచుకునే ఒక సజీవ పాత్ర. గాలికి ఎగిరే నకాబ్ అయినా, దారి పక్కన ఉన్న కుళాయి అయినా, ఆకాశంలో మెరిసే నక్షత్రాలైనా ఆయన కవిత్వం లో కొత్త అర్థాలను సంతరించుకుంటాయి. ఆయన కవిత్వంలో ఉర్దూ షాయిరీల ఛాయలు ,సూఫీ తత్వపు మెరుపులు కనిపిస్తాయి, ఇది ఆయన శైలిని ఇతరుల కంటే భిన్నంగా నిలబెడుతుంది. మానవ జీవితం ఒక నిరంతర అన్వేషణ అని, ఆ అన్వేషణలో మనం కోల్పోయిన వాటిని వెతుక్కుంటూ సాగడమే అసలైన జీవన ప్రయాణమని ఆయన 'పాదపూరణ' ద్వారా చాటిచెప్పారు.

కవి తన అస్తిత్వ వేదనను కేవలం వ్యక్తిగత దుఃఖంగా కాకుండా, అది ఒక సామాజిక గొంతుకగా మార్చడంలో విజయం సాధించారు. అక్షరాల ద్వారా అసంపూర్ణ జీవితాలను పూరించాలనే ఆయన తపన ఈ పుస్తకంలోని ప్రతి పేజీలోనూ దర్శనమిస్తుంది. అందుకే 'పాదపూరణ' కేవలం ఒక కవితా సంపుటి కాదు, అది మనిషి తనను తాను తెలుసుకోవడానికి, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ప్రేమించడానికి ఉపయోగపడే ఒక దిక్సూచి వంటిది. కాలం ఎంత వేగంగా మారిపోయినా, మానవత్వం ప్రేమ అనేవి శాశ్వతమని, వాటిని అక్షరబద్ధం చేయడమే కవి పరమావధి అని పాదపూరణ నిరూపిస్తుంది. నిశ్శబ్దంగా చదువుకుంటూ పోతే, ఈ కవితలు మన మనసులోని మౌనాన్ని మాటలుగా మారుస్తాయి, మన కళ్ళలోని కన్నీటిని ఒక కావ్యంలా మలుస్తాయి.

ఈ సంకలనానికి 2025లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడం అనేది ఆయన దశాబ్దాల సాహిత్య కృషికి దక్కిన సముచిత గౌరవం. ఒడియా సంస్కృతిని, భారతీయ ఆత్మను తన కవిత్వంలో ప్రతిబింబిస్తూ, ప్రపంచవ్యాప్త పాఠకులకు చేరువైన ఈ కావ్యం ఆధునిక భారతీయ సాహిత్యంలో ఒక చిరస్థాయిగా నిలిచిపోయే రచన.

బలియార్ సింగ్ పదపురాణ తో పాటు భరతవర్ష, చరణాచార్య, చతుర్దశశిర చంద్ర, ఉత్తర మేఘ, నీల నిర్వాణ, చర్యాచయన కావ్య పురుష వంటి అనేక కవితా పుస్తకాలు ఉన్నాయి. ఆయన తన 'భరతవర్ష' కవితా పుస్తకానికి ఒడిశా సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు.

గిరిజాకుమార్ ఉత్తర మేఘ కావ్యం పేరు వినగానే మనకు కాళిదాసు మేఘదూతం గుర్తుకు వస్తుంది. ఈ ఉత్తరమేఘం ఆధునిక మానవుడి ఒంటరితనానికి ప్రతిబింబిస్తుంది. పున్నమికి ముందు వచ్చే చతుర్దశి చంద్రుడిలాగే, మనిషి జీవితంలో కూడా ఏదో ఒక వెలితి ఉంటుందని చెప్పే తాత్విక కవిత చతుర్దశీర చంద్ర

ఒడియాలో సీతాకాంత్ మహాపాత్ర భారత వర్ష పేరుతో ఒక కావ్యం రాసారు.గిరిజకుమార్ బాలియార్ సింగ్ కూడా భారత వర్ష పేరుతో ఒకే కావ్యం రాసారు. ఈ రెండు కావ్యాలను తులనాత్మక పరిశీలన చేయడం మనసుకు,బుద్ధికి ఏక కాలం లో పనిపెట్టే క్రియ

**గిరిజకుమార్ దే మరొక కవిత**

ఓ పల్లెటూరా! నిన్ను ఒక దుఃఖ పంక్తి లో విడిచి వచ్చేశాను,
కానీ నేటికీ నీ కాటుక మబ్బులు నా ఆకాశపు కళ్ళలో మెరుస్తూనే ఉన్నాయి!
పంటల పగిలిన నుదుటిపై నువ్వు వాడిపోయిన గంధానివి,
అయినా గతం తాలూకు ఆ పవిత్ర సిందూర తిలకంలా కనిపిస్తున్నావు!
ఓ నదీ! నిన్ను రెండు కన్నీటి ధారల దగ్గర విడిచి వచ్చేశాను,
కానీ నేటికీ నీ సిగ్గుల అలలు ఆ రేవు రాళ్లను తాకుతూనే ఉన్నాయి!
ప్రేమ సుడిగుండంలో నువ్వు యవ్వనపు వంచనవి,
అయినా ఈ వైశాఖమంతా నిర్మలమైన నిరంజన నదిలా ప్రవహిస్తూనే ఉన్నావు!
ఓ జ్ఞాపకమా! నిన్ను ఆ మూడు గీతల అవతల విడిచి వచ్చేశాను,
కానీ నేటికీ నీ భయస్తురాలి పువ్వు నా మనసులో సువాసనలు పూస్తోంది!
గడిచిన తేదీల జాబితాలో నువ్వు అస్తమించిన చంద్రుడి తిథివి,
అయినా దూర దిగంతాల్లో పంచవటి వనంలా కనిపిస్తున్నావు!
ఓ ప్రేమా! నా 'గోప' ఎక్కడైతే ఉందో అక్కడే నిన్ను విడిచి వచ్చేశాను,
అయినా నేటికీ ఆ నక్షత్రాల వెలుగులో వెన్నెల చుక్క కోసం తపిస్తూనే ఉన్నావు!

(ఉత్తర మేఘం సంపుటి నుండి )



గిరిజకుమార్

మనిషి తన మూలాలను వదిలి పరాయి ప్రాంతానికి వెళ్ళినప్పుడు కలిగే తీరని వేదనను, జ్ఞాపకాల భారాన్ని ఎంతో ఆర్ద్రంగా ఆవిష్కరిస్తుందీ కవిత. కవి కి తన పల్లెటూరు కేవలం ఒక నివేశ ప్రదేశంగా కాదు , అదొక జీవనధార. ఆ ఊరిని విడిచిపెట్టి వస్తున్నప్పుడు కలిగే దుఃఖం, ఆకాశంలో కమ్మిన కాటుక మబ్బుల్లా కళ్ళముందే కదలాడుతుంటుందట . పంట పొలాలు బీటలు వారి ఉన్నా, అవి గతం తాలూకు పవిత్రమైన సిందూర రేఖల్లా కవికి కనిపిస్తాయట.నది ఒడ్డున గడిపిన క్షణాలు, అక్కడి నీటి అలల చప్పుడు తన అంతరాత్మలో ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయని కవి పదే పదే గుర్తు తెచ్చుకుంటున్నారు.

కాలం గడిచిపోయినా, జ్ఞాపకాలనేవి ఒక తీయని సువాసనలా మనసును అంటిపెట్టుకునే ఉంటాయని, అవి దూరంగా ఉన్నా పంచవటి వంటి పవిత్ర వనంలా రక్షణనిస్తాయట . ముఖ్యంగా చివరలో "నా గోప ఎక్కడైతే ఉందో అక్కడే నిన్ను విడిచి వచ్చాను" అనడంలో ఒక లోతైన వైరాగ్యం కనిపిస్తుంది. ఇక్కడ 'గోప' అంటే తన బాల్యం, తన స్వచ్ఛమైన ప్రేమ లేదా తన ప్రాణప్రదమైన తోడు అని అర్థం. భౌతికంగా తాను దూరంగా వచ్చినా, తన ఆత్మ మాత్రం ఆ పల్లెటూరి పొలిమేరల్లోనే ఉండిపోయిందని, ఆ వెన్నెల చుక్క కోసం తన మనసు నిరంతరం తపిస్తూనే ఉంటుందని కవి ఈ కవిత ద్వారా ఎంతో హృద్యంగా వివరించారు. ఇది కేవలం ఒక గ్రామం గురించి రాసినది మాత్రమే కాదు, ప్రతి మనిషి తన గతంతో తెంచుకోలేని అనుబంధానికి ఒక అద్దం పడుతుంది.

గిరిజాకుమార్ బలియార్ సింగ్ 1954 డిసెంబర్ 9న ఒడిశాలోని ఖోర్ధా జిల్లా 'నారగోద' గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం ఆయన వయస్సు సుమారు 71 ఏళ్లు. ఆయన కేవలం కవిగానే కాకుండా, ఒడియా సాహిత్యాన్ని ప్రచారం చేయడంలో కూడా చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

గిరిజకుమార్ బాలియార్ సింగ్ కవిత్వం చదవడం ఒక అనుభవం. ఆ అనుభవ సాంద్రత అనుభవైకవేద్యం అయితే కానీ తెలియదు. తెలుగు పాఠకుల తరపున గిరిజాకుమార్ బాలియార్ సింగ్ కి శుభాకాంక్షలు



**- వంశీకృష్ణ**
**95734 27422**

## పాలపిట్ట - వాసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

# డాక్టర్ వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ



సమాజంలో చెడును పరిహరించడం, మంచిని పెంచడం లక్ష్యంగా ఓ కవితల పోటీ నిర్వహించాలని వాసా ఫౌండేషన్ - పాలపిట్ట సంకల్పించాయి. డాక్టర్ వాసా ప్రభావతి స్మారకార్థం నిర్వహించే ఈ కవితల పోటీకి కవితలు పంపవలసిందిగా కవులను కోరుతున్నాము. చక్కని అభివ్యక్తి ఉన్న కవితలకు పోటీలో ప్రాధాన్యం ఉంటుంది.

| | |
|---|---|
| మొదటి బహుమతి: | రూ. 3000 |
| రెండో బహుమతి: | రూ. 2000 |
| మూడో బహుమతి: | రూ. 1000 |

ఎనిమిది కవితలకు ప్రత్యేక బహుమతులు
ఒక్కొక్క కవితకి రూ. 500

పోటీకి పంపించే కవితలు ఎక్కడా ప్రచురితం, ప్రసారమై ఉండ కూడదు. సోషల్‌మీడియాలో పోస్టు చేసి వుండకూడదు. పూర్తిగా కొత్త కవితలయి ఉండాలి.

కవితలు పంపించవలసిన చిరునామా:
ఎడిటర్, పాలపిట్ట
ఫ్లాట్ నెం: 3, బ్లాక్-6, ఏపిహెచ్‌బి
బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500044
సెల్: 9848787284

కవితలు పంపడానికి చివరి తేదీ: 30 ఏప్రిల్ 2026
ఫలితాలు ప్రకటించే తేదీ: 20 మే 2026
email: palapittamag@gmail.com

- గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట

# చదువరిని వెంటాడే జీవన సత్యాలు

విదేశీ ప్రముఖ రచయితలు రాసిన ఇరవై కథలను పొందుపరిచారు. గత నలభై ఏళ్లుగా తనని వెంటాడుతున్న ఈ కథలను, వాడ్రేవు చినవీరభద్రుడు గారు తన బ్లాగ్ ద్వారా వారం వారం పరిచయం చేశారు. ప్రతి కథకు ఆయన రాసిన 'ముందు మాట' ఈ సంకలనానికి ఆయువుపట్టు. డిజిటల్ మాధ్యమంలో ఇవి అందుబాటులో ఉన్నా, పుస్తకం చేతపట్టి చదవడంలోని ఆనందం అద్వితీయం.




"ఆయన్ని వెన్నాడే కథల్ని మనం ఎందుకు చదవాలి?" అని, పాఠకుడిగా రచయితగా నాలోని "రెండు నేనులు" మేల్కొని ప్రశ్నించాయి. దానికి సమాధానం ఈ పుస్తకమే ఇచ్చింది. ఈ సంకలనంలోని కథల ఎంపిక, కొత్తగా రాసేవారికి 'ఏది రాయాలో.. ఏది రాయకూడదో' దిశానిర్దేశం చేస్తుంది. మంచి సాహిత్యం మనల్ని మానవులుగా నిర్మించుకోవడానికి తోడ్పడుతుంది.

మున్షీ ప్రేమ్‌చంద్ 'సాల్ట్ ఇన్‌స్పెక్టర్' కథ నేను ఉద్యోగ ప్రస్థానానికి ముందే చదివి ఉంటే, వృత్తిపరమైన సమస్యలను మరింత దృఢ చిత్తంతో ఎదుర్కొనేవాడిని. 1907 నాటి ఈ కథ నేటికీ ప్రాసంగికత కలిగి ఉండటం మన సమాజపు దౌర్భాగ్యం.

వ్యంకటేశ మాడ్గూల్కర్ మరాఠీ కథ 'ఆంజనేయస్వామి వారు' స్వార్థ మానవుల పోకడను ఎండగడుతుంది. గుళ్లోని దేవుడు గనక లోక సంహారానికి పూనుకుంటే, అతనిపై యుద్ధం ప్రకటించక ఊరుకుంటారా!. ఇక, దేవుని వాహనాలుగా ప్రతిరూపాలుగా పూజించే జంతువులు పక్షులు ఓ లెక్కా!.

శరత్ బాబు 'మహేశం' సాటి మనిషి పట్ల, మూగజీవుల పట్ల కనికరం లేకపోవడమే నిజమైన దరిద్రమనే ఎరుక చదువరికి కలిగిస్తుంది. ఉండడానికి పది పేజీలు లేవుగానీ, పూర్తి చేసేలోపు పదిసార్లైనా పూడుకుపోయి ఉంటుంది గొంతు. గఫూర్ లు ఏ మతంలో లేరని! పేర్లు మాత్రమే మారుతాయి, వారి జీవితం ఎక్కడైనా మార్పు లేనిదే! జమీందారు పాత్రకు పేరు పెట్టలేదు రచయిత, విశ్వవ్యాప్తమైన కఠినాత్మకతకు పేరుతో పనేంటని!

ప్రఖ్యాత ఫ్రెంచ్ రచయిత గీ ద మోపాసా (Guy de Maupassant) రాసిన 'బెడ్ నెంబర్ 29' ఈ సంకలనంలో ఒకానొక శిఖరం వంటి కథ. యుద్ధం కేవలం సరిహద్దుల్లోనే కాదు, మనుషుల మనస్తత్వాల్లో, శరీరాల్లో కూడా ఎలా జరుగుతుందో ఈ కథ అద్దం పడుతుంది. ఒక వేశ్య పట్ల సమాజానికి ఉండే చిన్నచూపును, ఆమె చూపే దేశభక్తిని ఎదురెదురుగా నిలబెట్టి మోపాసా పాఠకుడిని నిలదీస్తాడు. అందం, ఆకర్షణ ఉన్నప్పుడు ప్రేమించిన పురుషుడు, ఆమె అనారోగ్యం పాలైనప్పుడు ఎంత క్రూరంగా ప్రవర్తిస్తాడో చూస్తే.. మానవ సంబంధాలలోని డొల్లతనం బయటపడుతుంది. యుద్ధ వీరుల మెడలోని పతకాల కంటే, ఆ వేశ్య శరీరంలోని గాయాలే గొప్పవని మోపాసా చెప్పిన తీరు గుండెల్ని పిండేస్తుంది. స్త్రీ త్యాగానికి, పురుష అహంకారానికి మధ్య సాగే ఈ పోరాటం పాఠకుడిలో బలమైన ముద్ర వేస్తుంది.

గంగాధర్ గాడ్గిల్ 'మొహం లేని సాయంకాలం' ఆదిమధ్యాంతాల శైలీ చట్రాన్ని ఛేదించిన కథ. నిజమే... ఆలూరి బైరాగి 'ఒక గంట జీవితం', త్రిపుర 'భగవంతం' కథలు గుర్తుకు వస్తాయి. ఒక్క కథైనా అలా రాయకపోతే రచయితగా అసంపూర్ణమే అనిపించక వదలదు.

మరో మరాఠీ కథ 'మంజుల' లోని 'చెమట సంసారం' అనే పదం ఇల్లాలి ఆవేదనను బిగ్ కాన్వాస్‌పై ఆవిష్కరిస్తుంది. భార్యాభర్తల సంబంధంలోని సున్నితపు పొరల్ని విడదీస్తూ మొగుళ్ల కళ్లు తెరిపిస్తాడు, కళ్ళనీళ్ళు తెప్పిస్తాడు కథకుడు అరవింద గోఖలే. స్త్రీ మనోభావాల్ని అర్థం చేసుకోవడానికి, స్త్రీగా మారి రాసిన కథ ఇది; లేకపోతే, మగగా సాధ్యం కాదు.

జయశంకర్ ప్రసాద్ 'గుండా' హిందీ కథ చారిత్రక అంశాలను కథలుగా మలిచే వర్ధమాన రచయితలకు ఒక పాఠం. ఆ కథ గనుక నేను ముందే చదివి ఉంటే, నిజాం యువరాణి నిలోఫర్ నేపథ్యంతో నేను రాసిన 'ఖట్నా' కథను మరింత మెరుగ్గా తీర్చిదిద్దే వాడిని.

జర్మన్ రచయిత్రి మరీ లూయిస్ కాష్నిట్జ్ రాసిన 'దుక్కపిల్ల' (The Fat Girl) అద్భుతమైన మనస్తత్వ చిత్రణ. మనం అసహ్యించుకునే మన పాత రూపమే మనల్ని ఎలా వెంటాడుతుందో, శారీరక ఆకృతి పట్ల పెద్దలు చూపే వివక్ష ఎంతటి అభద్రతకు దారితీస్తుందో ఇందులో కనిపిస్తుంది.

అలాగే, నోరైర్ ఆదాల్యాన్ కథ 'ఒంటెలు వెళ్లిపోతాయి, పర్వతాలు ఉండిపోతాయి' ఒక తాత్విక రూపకం. మనుషులు ఒంటెల బిడారుల్లా కాలప్రవాహంలో కదిలిపోతారు, కానీ వారి వేదన, మూలాలు మాత్రం పర్వతాల్లా అచలంగా నిలిచిపోతాయనే సత్యాన్ని ఈ ఆర్మీనియన్ కథ కళ్లకు కడుతుంది.

ఈ సంకలనం కోసం ఎంచుకున్న కథలు భిన్న సంస్కృతుల మధ్య వారధులు. రష్యా మంచు మైదానాలైనా, పల్లెటూరి మట్టి అయినా.. మనిషి ఆవేదన ఒక్కటేనని ఈ పుస్తకం నిరూపిస్తుంది. చినవీరభద్రుడు గారు ఈ కథలను మనకు పరిచయం చేసిన విధానం, వాటి వెనుక ఉన్న సామాజిక కోణాలను విశ్లేషించిన తీరు అద్భుతం. ప్రతి రచయితా తనను తాను సరిచూసుకోవడానికి, ప్రతి పాఠకుడూ తనను తాను నిర్మించుకోవడానికి చదవాల్సిన అద్భుత పుస్తకమిది.

**- పిన్నంశెట్టి కిషన్ (9700230310 )**

# రాంనగర్ బీసీ హాస్టల్ అనుభవాలు

చదువు నేర్పలేదు జీవితం నేర్పింది,
ఆకలిలో అక్షరాలు పెట్టి
జ్ఞాపకాలతో మనుషుల్ని చేసింది.
గోడ మీద మెనూలో ఒకటి,
మా ప్లేట్‌లో ఇంకొకటి.
అదే మాకు
ప్రభుత్వం నేర్పిన మొదటి గణితం
వాగ్దానం, వాస్తవం.
ఇరవై మందికి ఒకే గది,
ఇరవై జీవితాలకు
ఒక్కటే ఆకాశం.
ఆ గది నిద్రకోసం కాదు,
నిలబడటం నేర్చుకునే పాఠశాల.
పొద్దున్న కాలేజ్ కి పోవాలంటే
బాత్రూమ్ ముందు మా వరుస
ఎన్నికల క్యూలా ఉండేది,
బకెట్ల కోసం, నీళ్ల కోసం ఒక యుద్ధమే అయ్యేది.
వారానికి ఒకసారి వచ్చే వార్డెన్,
కాని రోజూ కనిపించే వంటమనిషే
మా ఆకలికి అర్థమయ్యాడు.
ఎక్కడికైనా బయటకో పెళ్లికో, వెళ్లాలంటే
దండెం మీద వేలాడే ఎవరి బట్టలైతే అవే,
మనవి కాని షర్టుల్లో
మా ఆత్మగౌరవం దాచుకొని
మనుషుల మధ్యకి వెళ్లేవాళ్లం.
కొత్త బట్టలు ఎవరైనా కొంటే,
ముందుగా అందరం వేసుకుని మురిసేవాళ్లం.
బాధల మాదిరి బట్టలను, ఆశలను, కలలను పంచుకునేవాళ్లం.
ఆదివారం వస్తే
హాస్టల్ గడియారం కంటే ముందు
మా కడుపే మేల్కొనేది.
250 రూపాయల కోసం
మేము కేటరింగ్ కి వెళ్లేవాళ్ళం,
అది పని కాదు
ఆకలితో చేసిన ఒప్పందం.
పెళ్లిళ్ల హాళ్లలో
ప్లేట్లు మోస్తూ తిరిగినప్పుడు
ఎన్ని అవమానాలు
నిశ్శబ్దంగా మింగామో ఆ ప్లేట్లకే తెలుసు.
కానీ పని అయిపోయి
చేతిలో పడిన 250 రూపాయలు
మాకు జీతం కాదు
ఆత్మగౌరవం లా అనిపించేవి.
ఆ పైసలతో
కోఠి బట్టల దుకాణాల వీధుల్లో తిరిగితే
అది షాపింగ్ కాదు
మా పేదరికం మొదటిసారి
మాల్ లోకి అడుగుపెట్టిన రోజు.
జేబులో బస్ పాస్ ఉంటే
హైదరాబాద్ అంతా
మా ఊరిలా అనిపించేది.
ఎక్కడికి వెళ్లినా
మనకూ ఒక దారి ఉందనే ధైర్యం.
హైదరాబాద్ లోని ఎన్నో కొత్త రూట్లు
మా కాళ్లకు అప్పుడు తెలిసాయి.
కింద నేలే మాకు బెడ్ అయ్యేది
కింద నేల మీదే మా ప్రపంచం.
నక్షత్రాలు చూసి పడుకున్నాం,
నక్షత్రాలను ప్రశ్నించటం నేర్చుకున్నాం.
ఇక్కడ మంచాలకంటే
నేల మీదే ఎక్కువ కథలు పుడతాయి,
పాత దుప్పట్లలో ముడుచుకుని నిద్రపోయినా
మా కళ్లలో మాత్రం రేపటి కలలు మేల్కొంటూనే
ఉంటాయి.

**బసడ సంపత్ యాదవ్**
**7032132593**

# మనిషి తనంతోనే ప్రవహిస్తున్నాను..!

పచ్చని అడవి గాలి స్పర్శతో
పక్షుల కిలకిల రావాలతో
మత్తెక్కించే ప్రశాంతమైన వాతావరణంలో
మబ్బును చీల్చుకొని వస్తున్న కిరణాల్లా
సమస్యల వలయాన్ని చీల్చుకొని
ఎదిరించి నిలబడే ధీరత్వాన్ని
మదినిండా నింపుకొని
కార్య క్షేత్రంలోకి అడుగిడుతున్నాను..!

అర్థవంతమైన వాక్య నిర్మాణంతో
పదును తేలిన భావాలతో
అన్యాయాన్ని ధిక్కరించే తెగువతో
తడబాటు లేని మాటలతో
ఒక స్పష్టమైన చూపుతో
గురి తప్పని విలుకాడిలా దుర్భరమైన
దీనావస్థలను ఛేదించుకుంటూ
మడమ తిప్పని నడకతో
సాగుతున్నాను.!

ప్రతి మలుపొక పద్మవ్యూహం
ప్రతి స్నేహమొక నయవంచన
ఎడతెగని కెరటాల జ్ఞాపకాలు
నిలువెల్లా అల్లుకున్నాయి
కలలన్నీ కళ్ళముందే చెదిరిపోయాయి
స్వాప్నిక జగత్తు కూలిపోయింది
తనువంతా సలుపుతున్న గాయాల
దుఃఖంతోనే నడయాడుతున్నాను.!

ఆశల దీపాలను ఆరిపోనివ్వకుండా
అవమానాలను దరి చేరనీయకుండా
అనుభవాల గాథలను మరువకుండా
అచంచలమైన విశ్వాసాన్ని
వదలకుండా
అంతస్తుల అంతరాలను
పట్టించుకోకుండా
జవసత్వాల దృఢత్వాన్ని కోల్పోకుండా
కుట్రల కుతంత్రాల వలల్లో
చిక్కుకోకుండా
మనిషితనంతోనే ప్రవహిస్తున్నాను..!

**గోపగాని రవీందర్**
**9440979882**

**రచనలకు ఆహ్వానం**
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
haneefsd777@gmail.com
whatsapp 9247580946

మహా పత్రిక 05
సోమవారం, హైదరాబాద్ | 30-03-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# మణుగూరు పీకే ఓసి–2లో విషాదం..

## డంపర్ టైర్ పేలి కార్మికుడి మృతి.. నలుగురికి గాయాలు.. 1 ఒకరి పరిస్థితి విషమం..




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలోని పీకే ఓసి-2 గనిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విపిఆర్ (దుర్గ) ఓబీ కంపెనీలో ఆగిపోయిన 60 టన్నుల స్కానియా డంపర్ టైర్‌ను విప్పే క్రమంలో అకస్మాత్తుగా టైర్ పేలింది. ఈ ఘటనలో బీహార్‌కు చెందిన టైర్ ఫిట్టర్ మహమ్మద్ సర్ఫరాజ్ (40) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో సాహెబ్ లాల్ యాదవ్ (50), జగదీష్ కుష్వాల్ (50), మంతూ కుమార్ (30), మొహమ్మద్ తాజ్ అన్సారీ (28) లు గాయపడ్డారు. వీరిలో సాహెబ్ లాల్ యాదవ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం తరలించారు. మిగతా గాయపడిన వారికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఏరియా జీఎం దుర్గం రామ చందర్, పీకే ఓసి ప్రాజెక్ట్ అధికారి రమేష్, ఏరియా ఇంజనీర్ ఆర్ శ్రీనివాస్, అధికారి ప్రతినిధి ఎస్ రమేష్, సెక్యూరిటీ అధికారి ఎం శ్రీనివాస్ తదితరులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించారు. గాయపడిన కార్మికులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అవసరమైతే హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని అధికారులు వైద్యులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై ప్రాథమిక సమాచారం ప్రకారం టైర్ రింగ్ విరిగిపోవడంతో భారీ పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. బాధితులట్ర్ మృతుడితోపాటు మరో ముగ్గురు బీహార్ రాష్ట్రానికి చెందిన వారు కాగా ఒకరు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కార్మికులేనని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. మృతుని కుటుంబానికి రూ.40 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి ఉత్తమ వైద్యం అందించాలని, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన మైన రక్షణ చర్యలు తీసుకోవాలని, ఓబీ కంపెనీలు ఎస్ఓపీ పూర్తిగా అమలు చేయాలని కోరాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు వై రాంగోపాల్, మేకల ఈశ్వర్, ఐఎన్‌టీయూసీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, సిల్వర్ గట్టయ్య, షేక్ అబ్దుల్ రఫూఫ్, సీఐటీయూ నాయకులు మందా నరసింహా రావు, వి వెంకటరత్నం, ఐఎఫ్‌టీయూ నాయకులు యస్.డి నాసర్ పాషా, అంగోత్ మంగీలాల్, టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లి వెంకట్, హెచ్ఎంఎస్ నాయకులు శ్రీలత, మస్తాన్, బీఎంఎస్ నాయకులు బి. కిషన్ తదితరులు ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ఓబీ కార్మికులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఘనంగా టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవం

## దేశానికి సంక్షేమ పథకాలు పరిచయం చేసింది ఎన్టీఆర్ అరెం రామయ్య



**జూలూరుపాడు, మహా:** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ సైరా ని యోజకవర్గ నాయకులు అరెం రామయ్య ఆధ్వర్యంలో చంద్రుగొండ క్రాస్ రోడ్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అరెం రామయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కేవలం రాజకీయ వేదిక మాత్రమే కాకుండా కోట్లాది తెలుగు ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపమని పేర్కొన్నారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ ప్రజల్లోకి వెళ్లిన తీరు భారత రాజకీయాల్లో అరుదైన ఘట్టమని నే ఎన్టీఆర్ సిద్ధాంతాలను పార్టీ నేటికీ పాటిస్తున్నదని, టీడీపీ ఆవిర్భావం తర్వాతే అణగారిన, బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. దేశానికి సంక్షేమ పథకాల భావనను పరిచయం చేసిన పార్టీ తెలుగుదేశమేనని అన్నారు. పార్టీ కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవం అంటే ఇంటి పండుగలాంటిదని, ప్రతి కార్యకర్తకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏన్కూరు మాజీ ఎంపీపీ అరెం వరలక్ష్మి, స్వర్ణ నరసింహారావు, బెల్లంకొండ రాము, నేరెళ్లకుంట శ్రీనివాస్ శర్మ, చలమల గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌బీ స్టేడియంలో మెరిసిన ఎమ్మెల్యే పాయం..

## వాలీబాల్, షటిల్‌లో ఎమ్మెల్యే అద్భుత ప్రదర్శన..



**మణుగూరు, మహా :** హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర శాసనసభ్యుల క్రీడా, సాంస్కృతిక మహోత్సవాల్లో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకున్నారు. వాలీబాల్, షటిల్ విభాగాల్లో ఆయన చూపిన ప్రతిభ ప్రేక్షకులను మెప్పించింది. క్రీడాస్ఫూర్తితో ఆడుతూ సహచర ప్రజాప్రతినిధులతో స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడటమే కాకుండా పరస్పర స్నేహభావాన్ని కూడా పెంచుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలను ప్రోత్సహించే చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ క్రీడా మహోత్సవాల ద్వారా ప్రజల్లో క్రీడలపై ఆసక్తి మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఉల్లాస్ – నవభారత సాక్షరత మూల్యాంకన పరీక్ష నిర్వహణ

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఉల్లాస్ - నవభారత సాక్షరత మూల్యాంకన పరీక్ష" కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు హాజరై, విద్యాపై గ్రామీణ ప్రజల్లో అవగాహన పెంపొందించే దిశగా తన మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా పరీక్షకు హాజరైన మహిళలకు సర్పంచ్ స్వయంగా పెన్నులు పంపిణీ చేసి, వారిని ప్రోత్సహించారు. చదువు పట్ల ఆసక్తి చూపుతున్న మహిళలను అభినందిస్తూ, వారు సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. వారి ఉత్సాహం గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మాట్లాడిన మందా నాగరాజు, నిరక్షరాస్యత నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువు నేర్చుకోవడం ద్వారా తమ జీవితాల్లో మార్పు తీసుకురావచ్చని, అలాగే కుటుంబం మరియు సమాజ అభివృద్ధికి తోడ్పడగలరని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గ్రామ ప్రజలందరూ సహకరించాలని, ముఖ్యంగా యువత ముందుకు వచ్చి పెద్దలకు చదువు నేర్పే బాధ్యత తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ట్రాఫిక్ నియమాలపై అవగాహన

## డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఎస్సై గోపి




**కారేపల్లి, మహా :** వాహనదారులు రక్షణాత్మక డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలని కారేపల్లి ఎస్సై బైరు గోపి అన్నారు. ఆదివారం అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా కారేపల్లి క్రాస్ రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయడం ప్రమాదకరమని, అతివేగం ప్రాణాంతకమని హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్ నిషేధమని, మైనర్ల కు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు.

# 37వ డివిజన్ అభివృద్ధిపై కార్పోరేటర్ ఫోకస్

- డ్రైనేజీలు పారిశుధ్యం శుభ్రతపైనే ప్రధాన దృష్టి
- ఎండాకాలం దృష్ట్యా నిరంతర నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు
- నేడు పాలకవర్గ సమావేశం
- సమస్యలపై చర్చించనున్న కార్పొరేటర్ మల్లెల స్వప్న కుమారి రవిచంద్ర




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం పాల్వంచ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 37వ డివిజన్ అభివృద్ధిపై స్థానిక మహిళ కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి రవిచంద్ర ఫోకస్ పెట్టారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రధానంగా పరిశుద్ధం పైనే దృష్టి సారించారు. కార్పొరేటర్ ఎన్నికైన నాటినుండి నేటి వరకు డివిజన్లోని డ్రైనేజీలను శుభ్రం చేయించడం అనంతరం ఆ చెత్తను తొలగించడం వంటి కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నారు. డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బంది చేత తీసివేయిస్తూ కాలువలో మురుగునీరు సక్రమంగా పోయే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఎండాకాలం దృష్ట్యా డివిజన్లో నీటి సమస్య లేకుండా కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి అప్రమత్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల పారిశుధ్య సిబ్బంది సహకారంతో కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి రవిచంద్ర 37వ డివిజన్ అభివృద్ధి చేయడంలో చూపిస్తున్న శ్రద్ధ పట్ల పలువురు అభినందిస్తున్నారు.

**సమావేశంలో అధికారుల దృష్టికి సమస్యలు..**

కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం మొట్టమొదటి సమావేశం జరగనున్నది. ఈ సమావేశంలో పాల్వంచ 37వ డివిజన్లోని నెలకొని ఉన్న ప్రధానమైన సమస్యలను కార్పొరేటర్ మల్లెల స్వప్నకుమారి రవిచంద్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

- కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి
- సుప్రీంకోర్టు తీర్పుపై పార్లమెంట్ లో చర్చ జరపాలి
- బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు



**నేలకొండపల్లి, మహా:** భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కును దళిత క్రైస్తవుల కు వర్తింపజేయడంలో జరుగుతున్న చారిత్రక అన్యాయంపై, సుప్రీంకోర్టు తీర్పుపై పార్లమెంట్లో చర్చ జరగాలని బీఎస్పీ నేలకొండపల్లి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. నేలకొండపల్లి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేవలం మతం మారినంత మాత్రాన దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, ఆర్థిక వెనులుబాటు తనం తొలగిపోవన్నారు , దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా కేవలం హిందూ దళితులకు మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చేశారని, ఆ తర్వాత 1956లో సిక్కులకు, 1990లో బౌద్ధులకు వర్తింపజేశారన్నారు. ప్రభుత్వం క్రైస్తవ దళితులను విస్మరించడం ఆర్టికల్ 14 (సమానత్వం), ఆర్టికల్ 15 (వివక్ష రహితం)లను ఉల్లంఘించడమేనన్నారు. ఆర్టికల్ 25 ప్రకారం ఒక వ్యక్తి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే హక్కు ఉందని, అతనికి రాజ్యాంగపరంగా అందాల్సిన సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. జీఓ ఎంఎస్ నం:341 ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో దళిత క్రైస్తవులను 'బిసిసి' వర్గంగా గుర్తించారని, అయితే వీరికి అందుతున్న 1 శాతం రిజర్వేషన్ వారి జనాభా ప్రాతిపదికన ఏమాత్రం సరిపోదని, వీరికి పూర్తిస్థాయి ఎస్సీ హోదా కల్పించాల్సిన అవసరం ఉందని బాబురావు గుర్తు చేశారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదికలో దేశవ్యాప్తంగా దళిత క్రైస్తవుల పరిస్థితి ఇతర ఎస్సీల కంటే హీనంగా ఉందని, మతంతో సంబంధం లేకుండా వారికి ఎస్సీ హోదా ఇవ్వాలని సిఫార్సు చేశారన్నారు. "ఎవరైనా వేరే మతంలోకి మారినప్పటికీ పుట్టకతో వచ్చే కులం మారబోదని పెళ్లయ్యాక కూడా అది అలాగే ఉంటుందని 13, ఫిబ్రవరి 2026 న అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిందనే విషయాన్ని గుర్తు చేశారు."కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ కొటేషన్ దాఖలు చేయాలన్నారు.

# పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు అండగా ఉంటాం

- స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సమస్యలను ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకెళ్తాం
- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఆరేళ్లుగా సేవలందిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లను శానిటేషన్ విభాగంలో తగిన గుర్తింపులభించేలా చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ హామీ ఇచ్చారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌ను ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో మర్యాదపూర్వకంగా కలిసిన స్వచ్ఛ ఆటో డ్రైవర్లు తమ ఉద్యోగ భద్రత శానిటేషన్ డ్రైవర్లుగా గుర్తించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఎటువంటి ఉత్తర్వులు లేకపోయినప్పటికీ చాలిచాలని వేతనాలతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో డ్రైవర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్మికుల ఉద్యోగ భద్రత వేతనాల పరిష్కారానికి పాలకవర్గం తరపున పూర్తి సహకారం అందిస్తామని పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుండి సానుకూల నిర్ణయం వచ్చేలా ఒత్తిడి తెస్తామని భరోసా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా మేయర్ పునరుద్ఘాటించారు. వినతిపత్రం అందించిన వారిలో స్వచ్ఛ ఆటో డ్రైవర్లు బి.అనిల్ కుమార్, నాగేందర్ బాబు, బాలాజీ, సయ్యద్ అలీ తదితరులు ఉన్నారు.

# కనీస విద్యను నేర్పించటమే అమ్మకు అక్షరమాల లక్ష్యం

## రాష్ట్ర వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్



**నేలకొండపల్లి, మహా:** చదువు మధ్యలో మానేసిన వారికి కనీస విద్య ను నేర్పించటమే అమ్మకు అక్షర మాల లక్ష్యమని రాష్ట్ర వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్ పేర్కొన్నారు. మండలం లోని ఆరెగూడెం, ఆచార్లగూడెం, గువ్వలగూడెం తదితర గ్రామాలలో ఆదివారం జరిగిన ఉల్లాస్ 2026 అభ్యాసకుల పరీక్ష సెంటర్ల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఖమ్మం జిల్లాలో 20 మండలాలలో 29, 922 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 22 మండలాలలో 19,194 మంది అభ్యాసకులు ఉన్నట్లు తెలిపారు. వీరికి నిర్వహించిన పరీక్షలు విజయవంతమైయ్యాయని పేర్కొన్నారు. 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు వారు చదువును మధ్యలో మానేసిన వారికి కనీస విద్య ను అందించాలనే 'లక్ష్యం తో ప్రభుత్వం కార్యక్రమం ను రూపొందించినట్లు తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమం ను విజయవంతం చేసేందుకు ఐకేపీ, విద్యాశాఖ అధికారులు విశేషంగా కృషి చేశారని తెలిపారు. అమ్మకు అక్షరమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కార్యచరణ నూ రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్ మంగపతి, నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతి రావు, మండల ఐకేపీ కోఆర్డినేటర్ సురేందర్, కోలేటి సుజాత ,ఆయా పంచాయతీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిన్లాండ్ లో విద్యావ్యవస్థ ఆధ్యయన యాత్ర

- నేలకొండపల్లి యంఈవో చలపతిరావు కు అవకాశం
- 40 మంది బృందం కు ప్రతినిధిగా నియామకం
- ఏప్రిల్ 20 నుంచి 24 వరకు ఫిన్లాండ్లో పర్యటన



**నేలకొండపల్లి, మార్చి 29 మహా :** ఫిన్లాండ్ లో విద్యా వ్యవస్థ ను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ ను పరిశీలించేందుకు 40 మందిని ఎంపిక చేసింది. రాష్ట్ర విద్యా పరిశీలకులు బృందంలో ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు కు అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని 40 మంది బృందం కు టీమ్ లీడర్ గా ఎంపిక చేశారు. ఫిన్లాండ్ లో నూరు శాతం విద్యా ఎలా సాధ్యమవుతుంది. ప్రపంచ ఉత్తమ పద్ధతులను అవలంభిస్తున్న ఫిన్లాండ్ పద్ధతులను 2. తెలుసుకునేందుకు రాష్ట్రంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రభుత్వం అవకాశం కల్పించారు. దీని ద్వారా వారి వృత్తి పరమైన ...సామర్థ్యాలను పెంపొందించటం కోసం ఫిన్లాండ్ పర్యటన ను ఖరారు చేశారు. విద్యా శాఖ నుంచి డైరెక్టర్ జీ.రమేష్, డీఈఓ ల నుంచి సంగారెడ్డి జిల్లా డీఈవో ఎస్. వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష కార్యాలయం ఎస్పీడీ శిరిష, మండల విద్యాశాఖాధికారుల నుంచి నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు ను ప్రతినిధులుగా నియమించారు. ఈ బృందం ఫిన్లాండ్ లో ఏప్రిల్ 20 నుంచి 24 వరకు పర్యటిస్తారు. అందులో రెండు రోజుల పాటు ఫిల్ ల్యాండ్ యూనివర్శిటీ లో ట్రైనింగ్ తీసుకుంటారు. మరో రెండు రోజుల పాటు పలు పాఠశాలలో భోధన ను పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా పరిశీలకుల ప్రతినిధిగా నియమితులైన "నేలకొండపల్లి యంఈవో చలపతిరావు మాట్లాడారు...రాష్ట్రంలో విద్యా ను మరింత బలోపేతం చేసేందుకు 40 మందిని ఫిన్లాండ్ పర్యటన కు పంపిస్తున్నట్లు తెలిపారు. అక్కడి విధానాలను క్షేత్ర స్థాయి లో తెలుసుకుని రాష్ట్రంలో మార్పులు, చేర్పులు చేసేందుకు పరిశీలించనున్నట్లు తెలిపారు. పర్యటన బృందం కు ప్రతినిధి గా ఎంపిక చేయటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కారం కోరకు చర్యలు



**నేలకొండపల్లి, మహా:** స్థానిక మేజర్ పంచాయతీ లోని ఎస్సీ, బీసీ కాలనీ లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు నేలకొండపల్లి మేజర్ పంచాయతీ 13 వ వార్డు సభ్యులు కొడిరెక్క వినోద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కాలనీ లో ఆదివారం నూతనంగా విద్యుత్ స్థంబాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...మంత్రి శ్రీనివాసరెడ్డి చోరవ తో నూతనంగా విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్సీ, బీసీ కాలనీ లో ఏళ్ల తరబడి విద్యుత్ సమస్య ను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాలనీ ప్రజలకు విద్యుత్ వెలుగులు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేసినట్లు తెలిపారు. తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వార్డు లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 14 వ వార్డు పంచాయతీ వార్డు సభ్యులు మన్నె సుప్రజా, కాలనీ యూత్ సభ్యులు మన్నె నరేష్, కాసాని సంధీఫ్, చింతమళ్ల వెంకటేష్, కె,రమేష్, మహేష్, కొడిరెక్క శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా మ్రాణికొమ్మల ఆదివారం వేడుక

## క్రీస్తు శ్రమలను పురస్కరించుకొని క్రైస్తవుల ప్రార్థనలు



**సత్తుపల్లి, మహా:** క్రైస్తవ భక్తుల ఉపవాస దీక్షలో భాగంగా క్రీస్తు శ్రమలను పురస్కరించుకొని కిష్టారం గ్రామం అంబేద్కర్ నగర్ కాలనీలోని ఆర్.సీ.ఎం తిరు హృదయ దేవాలయంలో మ్రాణికొమ్మల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా సత్తుపల్లి విచారణ సహాయక గురువులు రెవ"ఫాదర్ మ్యారియో (ఓ.సి.డి) ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవులు ఈత మట్టలను పూలతో అలంకరించి ఏసుక్రీస్తుకు జయ జయ నినాదాలు పలుకుతూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం రెవ"ఫాదర్ మ్యారియో ప్రార్థనలు నిర్వహించి భక్తులకు ఆశీర్వాదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు మారోజు నాగేశ్వరరావు, వాడపల్లి శ్రీను, వాడపల్లి సుందర రావు, పాలకుర్తి శారద, వాడపల్లి కోటేశ్వర రావు, వాడపల్లి కర్ణరావు, తాళ్ల నాగేశ్వరరావు, పాగా విజయలక్ష్మి, అమర్లపూడి సుధారాణి, బొందల చైతన్య, పణితి మేరీ మాత అధిక సంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



**సత్తుపల్లి, మహా:** క్రైస్తవుల ఉపవాస దీక్షల కాలంలో భాగంగా,మట్టల ఆదివారం వేడుకలను సిద్ధారం రోడ్ లోని బిలీవర్స్ చర్చ్ ప్రాంగణంలో,పాస్టర్ నందికోల యాకోబు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించారు. క్రైస్తవ భక్తులు ఉపవాసాలు జరిపి,పాటలతో ప్రార్థనలు జరిపించారు. పాస్టర్ మాట్లాడుతూ ఏసుప్రభు శిలువ మరణం ముందు, ఎరుషలేములో భక్తులు ఆయనకు ఖర్జూరం మట్టలు, వాటికి పూలు తయారు చేసి, ఆయన మీద ప్రేమ ను ఈ విధంగా వ్యక్తం చేస్తారంటూ తెలియజేశారు. ప్రేమకు సాదృశ్యంగా ఈ విధంగా తయారుచేసి,ఆయనపై భక్తిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో చిన్న, పెద్ద మట్టలతో హోసన్న జయము,జయము తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య,జ్యోతి,సురేష్,మురళి,సుజాత,నాగ కుమారి, మురళి,సునీత,సురేష్,చింటూ, కమల,స్వామి,శిరీష,రవీందర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రబోడులో విద్యుత్ తీగల చోరీ

**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం ఎర్రబోడు గ్రామంలో కరెంట్ స్తంబాలకు ఉన్న విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ పరిసరాల్లో వ్యవసాయ భూములకు వెళ్ళు సుమారు పది కరెంటు స్తంభాలకు సంబంధించిన విద్యుత్ తీగలను కత్తిరించి దొంగిలించారు. ఈ ఘటనతో గ్రామంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆదివారం ఉదయం బాధిత రైతులు కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో వైర్ల చోరీ, విద్యుత్ మోటర్ల దొంగతం వంటి సంఘటనలు జరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.

# రైస్ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంతో మహిళ మృతి

- వరిపొట్టు మీద పడి ఊపిరాడక మహిళ కూలీ మృతి
- మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారాకో

**నేలకొండపల్లి, మహా:** నిబంధనలు పాటించకపోవటంతో రైస్ మిల్లు లో ఓ నిండు ప్రాణం పోయింది. యాజమాన్యం నిర్లక్ష్యం వలన జరిగిన ప్రమాదంలో మహిళ కూలీ మృతి చెందింది. యాజమాన్యం స్పందించకపోవటంతో బంధువులు రాస్తాకారో నిర్వహించారు. మిల్లు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా,నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం వద్ద ఉన్న అరుణాచల రైస్ మిల్ లో ఆదివారం మహిళ కూలీ మృతి చెందింది. కూసుమంచి మండలం లోని జక్కేపల్లి గ్రామానికి చెందిన పప్పుల కళ్యాణి (34) అనే మహిళ రైస్ మిల్లు లో రోజు వారీ కూలీ పనులకు వెళ్తుంది. ఆదివారం 'మిల్లులో వరి పొట్టు తీసేందుకు పనులు చేస్తుండుగా పొట్టు మొత్తం ఒక్కసారిగా ఆమె పై పడింది. అక్కడే ఉన్న సహచర కూలీలు కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే ఊపిరాడక అపస్మారక స్థితికి చేరింది. కొంత మంది ఆమె కు సీఆర్పీ చేసి...నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో వైద్యం కోసం తీసుకొచ్చారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి పై మిల్లు యాజమాన్యం స్పందించకపోవటంతో అగ్రహించిన బంధువులు, కుటుంబ సభ్యులు నేలకొండపల్లి ప్రధాన సెంటర్ లో రాస్తారాకో నిర్వహించారు. మిల్లు యాజమాన్యం పై తగిన చర్యలు తీసుకోవాలని..మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరికి సీపీఎం మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు కర్నాటి భానుప్రసాద్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఖమ్మంకోదాడ ప్రధాన రహదారి పై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని ఆందోళనకారుతో చర్చించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజేశ్వరపురం లోని రైస్ మిల్లు లో గతంలో కూడ ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తుంది.

ANN తెలుగు
మహా పత్రిక
06
సోమవారం, హైదరాబాద్ | 30-03-2026
జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM




## భద్రాచలంలో ప్రజావాణి నేడే

**భద్రాచలం మహా :** భద్రాచలం మండల ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ రోజు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి వివిధ శాఖల మండల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో సమర్పించాలని సూచించారు. అందిన వినతులను సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు



## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భా దినోత్సవ వేడుక

**మహా దుమ్ముగూడెం:** తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని దుమ్ముగూడెం మండలంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దుమ్ముగూడెం మండల కేంద్రం లక్ష్మీనగరంలో అవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల అధ్యక్షుడు కొమరం దామోదర రావు తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ములకపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.సుభాషిణీ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహణ కార్యదర్శి,,సీనియర్ నాయకులు శ్రీ కొడాలి సుబ్బారావు,తాళ్లూరి వీర్రాజు, వెంకటేశ్వర రావు, కెల్లా వేణు,నల్లూరి వీర్రాజు,కల్లూరి ప్రసాద్,సోందె వీరాస్వామి,,కొర్సా లక్ష్మయ్య,జీరి సత్యనారాయణ, పిలక నాగేంద్ర రెడ్డి,ముద్దు కూరి వేణు,తదితరులు. పాల్గొన్నారు.




## ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షకు 4వ రోజు

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలంలో సారపాకలో జరుగుతున్నా ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్ష 4వ రోజుకు చేరింది. ఆదివారం నాడు దాసరి వెంకటరమణ సేవా సంస్థ మిత్ర బృందం సభ్యులు దీక్ష శిబిరాన్ని సందర్శించారు.కార్మికులకు సంఘీభావం తెలిపిన వారు, నిమ్మరసం పంచి దీక్ష విరమింపు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకటరమణ, చెలికాని సాంబ, శివరావు, దాసరి మోహన్ రావు, గార్ల బేబీ రాణి, పతవలిక, బోడ చందు, మాలపెల్లి పవన్ కళ్యాణ్, జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించిన బిజెపి నాయకులు

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధి బృందావన్ కాలనీ లో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బీజేపీ కార్యకర్త సతీశ్ సంగ్మే నివాసంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 132 వ మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా బిజెపి నాయకులు, డివిజన్ నాయకులు కార్యకర్తల తో కలిసి మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, వెంకట రమణ గుప్తా, మజార్, బబ్లూ, మహిళ మోర్చ నాయకులు ఉడుత లక్ష్మీ, దయానంద్, సాయి,భోంస్లే, విజయ్ కుమార్, శివ, విజయ్, ఎన్ను శంకర్ రెడ్డి, రమేష్ , రామరావు, కిరణ్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏ ఎస్ రావు ఆశయ సాధనకు కృషి చేయాలి

### గద్దర్ అవార్డు పొందిన డాక్టర్ ఏ ఎస్ రావు డాక్యుమెంటరీకి ఘన అభినందన సభ



**కుషాయిగూడ, మహా :** మహానుభావుడు డాక్టర్ ఏ ఎస్ రావు ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎస్ రావు నగర్ హౌసింగ్ సొసైటీ వ్యక్తిగత ఇన్‌చార్జ్ కే ఈశ్వరయ్య, దాశరథి థియేటర్ అధ్యక్షుడు ఎస్ వినయ్ కుమార్ అన్నారు. డాక్టర్ ఏ ఎస్ రావు జీవితంపై రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రానికి గద్దర్ అవార్డు లభించిన సందర్భంగా శనివారం రాత్రి ఏఎస్ రావు నగర్‌లోని డాక్టర్ హోమీ జే బాబా కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ, డాక్టర్ ఏ ఎస్ రావు ఆశయాలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయాలనే ఉద్దేశంతో నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకొని డాక్యుమెంటరీ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గద్దర్ అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. ఈసీఐఎల్ సంస్థను స్థాపించి ఎలక్ట్రానిక్స్ రంగంలో దేశానికి విశిష్ట సేవలు అందించిన మహనీయుడు డాక్టర్ ఏ ఎస్ రావు అని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఈసీఐఎల్ సంస్థను ఏర్పాటు చేసి వేలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనదేనని గుర్తు చేశారు. ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ సాధారణ జీవితం గడుపుతూ ఆదర్శంగా నిలిచిన వ్యక్తి డాక్టర్ ఏ ఎస్ రావు అని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో వేలాది మంది యువ ఇంజనీర్లను దేశానికి అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ ఎస్ రావు జీవితంపై రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం ఆ చిత్రంలో నటించిన కళాకారులు, చిత్ర బృంద సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. జి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాశరథి థియేటర్ ఉపాధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు పి.బి చారి, ఈసీఐఎల్ మాజీ ఉద్యోగి మరియు డాక్టర్ ఏ ఎస్ రావు సన్నిహితుడు వికె ప్రేమ్ చంద్, డాక్యుమెంటరీ దర్శకుడు యు రఘురామచంద్ర, కార్యనిర్వాహక నిర్మాత బి డి ఎల్ సత్యనారాయణతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉప్పల్ పరిధి పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు




**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ పరిధిలోని పలు పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, గీతాలు, నాటికలతో తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసే ముఖ్య వేదికలని తెలిపారు. ఇలాంటి వార్షికోత్సవాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నైతిక విలువలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో పాజిటివ్ పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు శోభన దేవి, ఉపాధ్యాయులు నిర్మల, రమ్య, అత్య పాల్గొన్నారు. శ్రీ కాకతీయ టెక్నో పాఠశాల నిర్వాహకుడు కొండల్ రావు, ప్రధానోపాధ్యాయురాలు కొండల్ సప్న హాజరయ్యారు. చైతన్య భారత ఉన్నత పాఠశాల నిర్వాహకుడు వెంకన్న కూడా పాల్గొన్నారు. అలాగే సాయిబాబా కాలనీ అధ్యక్షుడు అంజి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, ఆకారపు అరుణ్ పటేల్, తుమ్మల దేవి రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, మోహన్ నాయక్, ప్రేమ్ గౌడ్, ప్రణయ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## బెల్లంపల్లి లో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### టిడిపి పట్టణఅధ్యక్షులు & సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి మణిరామ్ సింగ్

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం రోజు బెల్లంపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోటిడిపి పట్టణఅధ్యక్షులు & సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి మణిరామ్ సింగ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి 44వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా టిడిపి పార్టీ పుట్టి 44 ఏళ్లయిందని ఆవిర్భావ స్ఫూర్తి ఐక్యమత్యం చాటే సమయం అని రాష్ట్ర ప్రగతి ప్రజా సంక్షేమానికి సంకేతమైన పసుపు జెండా ప్రస్థానం కార్యకర్తలు నాయకులు సానుభూతిపరులు తమ తమ ఇంటిపై పసుపు జెండా ఎగరవేసి తెలుగు వాడినని గర్వంగా చాటాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజలతో మమేకమై వారి సాధక బాధలను పంచుకునే మాదిరిగా నాయకులు ఎదగాలని బడుగు బలహీన వర్గాల కోసం స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించినటువంటి పార్టీ తెలుగుదేశం పార్టీ 44 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఎగరవేసిఘనంగా కేక్ కట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిడిపిపట్టణాధ్యక్షులు& సింగరేణికాలరీస్ లేబర్ యూనియన్ ప్రధానకార్యదర్శి టి.మణిరాంసింగ్,ఎస్సీ ఎల్ యు ఉపాధ్యక్షులు గద్దలనారాయణ, నాయకులు పంటేల శంకరయ్య,అంబాలమచ్చయ్య,ఆర్ గంగాధర్ గౌడ్, పెద్ది రాము, గజ్జల దుర్గయ్య, గైన తిరుపతి, ఏ.కుమార్, ఎస్ఎస్ పాండే ,సిహెచ్ ప్రకాష్ హరికిషన్ పాండే పుల్లూరి పోశం మాసాడి గోపాల్ బొల్లు సత్యనారాయణ,ఎస్.కె అస్గర్ బాషా,గుండెటి శంకర్,ఎం. వెంకటస్వామి, కొత్తూరి నారాయణ,మేకల రాజయ్య,షబానా బేగం, పోతురాజుల రాములు,కీర్తి మల్లేష్ తదితరులుపాల్గొన్నారు.

# రంజీలో కశ్మీర్ నవశకం

### మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ ప్రశంసలు

**ఢిల్లీ, మహా:** భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖిస్తూ, ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి రంజీ ట్రోఫీని కైవసం చేసుకున్న జమ్ము కశ్మీర్ క్రికెట్ జట్టుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆదివారం నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా మాట్లాడుతూ..జమ్ము కశ్మీర్ ఆటగాళ్ల చారిత్రాత్మక విజయాన్ని, వారి అచంచలమైన అంకితభావాన్ని కొనియాడారు. దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది క్రికెట్ అభిమానులకు మార్చి నెల ఎంతో ఉత్సాహాన్ని, సరికొత్త రోమాంచిత అనుభూతులను పంచిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.భారత్ గతంలో టీ20 ప్రపంచకప్ గెలిచినప్పుడు దేశమంతా ఏ స్థాయిలో సంబరాలు చేసుకుందో, ఇప్పుడు కర్ణాటకలోని హుబ్లీ వేదికగా జరిగిన అత్యంత ఆసక్తికరమైన ఫైనల్ పోరులో జమ్ము కశ్మీర్ రంజీ ఛాంపియన్‌గా నిలవడం కూడా దేశవాసులందరికీ అంతే గర్వకారణమని మోదీ హర్షం వ్యక్తం చేశారు. జమ్ము కశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీ గెలవడం ఒక అద్భుత ఘట్టమని, ఆటగాళ్లు ఎన్నో ఏళ్లుగా చేసిన నిరంతర కృషికే ఈ అపూర్వ విజయం దక్కిందని ప్రధాని స్పష్టం చేశారు. ముఖ్యంగా జట్టు కెప్టెన్ పరాస్ డోగ్రా ప్రదర్శనను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, అద్భుతమైన క్రీడా నైపుణ్యంతో, అద్వితీయమైన నాయకత్వ లక్షణాలతో ఆయన జట్టును ముందుండి నడిపించారని కితాబిచ్చారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సంయమనం కోల్పోకుండా జట్టును విజయతీరాలకు చేర్చడంలో కెప్టెన్ పాత్ర ఎంతో కీలకమని, ఆయన మార్గదర్శకత్వం యువ ఆటగాళ్లకు ఎంతగానో ఉపయోగపడిందని ప్రధాని విశ్లేషించారు.

# గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

- నాలుగు రోజులు చికిత్స పొందుతూ మృతి
- చెన్నూరు సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ లో ఘటన



మంచిర్యాల, మహా : మంచిర్యాల జిల్లా చెన్నూరు సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ లో 7 వ తరగతి చదువుతున్న శ్రీవింధ్య (14) గడ్డిమందు తాగి ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. చెన్నూరు మండలం గంగారం గ్రామానికి చెందిన శ్రీవింధ్య నాల్గవ తరగతి నుంచి చదువుతోంది. గత బుధవారం సాయంత్రం శ్రీవింధ్య వాంతులు చేసుకోవడంతో పాఠశాల సిబ్బంది చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సమాచారాన్ని గురువారం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అక్కడ శుక్రవారం వరకు చికిత్స అందించిన నయం కాలేదు. బాలికకు మెరుగైన వైద్య చికిత్స కొరకు శనివారం ఉదయం కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమె పాయిజన్ తీసుకున్నట్టు అనుమానించి విద్యార్థినీ అడగగా అసలు విషయం చెప్పింది. అయితే అప్పటికే బాలిక లంగ్స్, కిడ్నీ, లివర్ డ్యామేజ్ అయినట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయం పోలీసులకు అందించారు. కాగా ఆదివారం ఉదయం బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలిక మృతి సమాచారం తెలిసిన వెంటనే బంధువులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రి కి తరలివచ్చారు. పాఠశాల సిబ్బంది వేధింపుల వల్లే బాలిక సూసైడ్ చేసుకుందని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు. విద్యార్థినీ మృతికి గల కారణాలు తెలియవలసి ఉంది. ఈ మృతి పట్ల పలు విద్యార్థి సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఖండించాయి.

## మల్లన్న స్వామి కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్న కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోన్ కొత్వాల్ గూడ డివిజన్ పరిధిలో ఆదివారం ఎయిర్‌పోర్ట్ కాలనీలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ--- మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం ప్రజల్లో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తుంది. ఇలాంటి పండుగలు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బంధాలను మరింత బలపరుస్తాయి. ప్రజలందరూ మల్లన్న స్వామి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్,డివిజన్ అధ్యక్షులు కోలన్ ప్రదీప్ రెడ్డి, దేరంపల్లి బుచ్చిరెడ్డి,కోన్న మొల్ల శ్రీనివాస్, రాజేందర్, మాజీ జెడ్పీటీసీ బుర్కుంటా సతీష్, మల్లేశ్ ముదిరాజ్, మాడపాటి నరేందర్, హన్మంత్ ముదిరాజ్, రాచమల్ల జయసింహ, గుంటి చరణ్, పరందములు, ఆర్. రమేశ్, బక్క శ్రీకాంత్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలించేందుకు సమిష్టి కృషి అవసరం

- కాసిపేట మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్ములనపై అవగాహన & కాసిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల కార్యక్రమం
- పోటీలను ప్రారంభించిన బెల్లంపల్లి రూరల్ సిఐ హనోక్



**బెల్లంపల్లి, మహా:** డ్రగ్స్ రహిత సమాజం కోసం సమిష్టి కృషి అవసరమని బెల్లంపల్లి రూరల్ సీఐ హనూక్ పేర్కొన్నారు ఆదివారం రోజు కాజీపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలోడ్రగ్స్ నిర్మూలన పై అవగాహన కార్యక్రమం తో పాటు కాసిపేట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి రూరల్ సిఐ హనోక్ పాల్గొన్నారు.కాసిపేట మండలకేంద్రంలోని ముత్యంపల్లి గ్రౌండ్ లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ రత్నం ప్రదీప్ క్రికెట్ టోర్నమెంట్ కి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి సిఐ అనోక్ ,కాసిపేట ఎస్సై ఆంజనేయులు లు జ్యోతిప్రజ్వలన చేసి క్రీడాకారులతో కలిసి ముత్యంపల్లి క్రీడమైదానం నుండి కాసిపేట అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం బెల్లంపల్లి రూరల్ సీఐ అనోక్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం యువతను, సమాజాన్ని చిన్నాభిన్నం చేసే అత్యంత ప్రమాదకరమైన వ్యసనం అని, శారీరక,మానసిక ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీస్తాయని వివరించారు. కాసిపేటఎస్సైఆంజనేయులు మాట్లాడుతు మాదక ద్రవ్యాల ప్రభావంతోఉన్నప్పుడు వ్యక్తులు సామాజికవ్యతిరేఖ పనులు,నేరపూరిత ప్రవర్తనకు పాల్పడే అవకాశంఉందని,వ్యసనం ఒక్కసారి అలవాటైతే ఆ వ్యసనం నుండి బయటపడటం చాలా కష్టం అని చెప్పడం జరిగింది.అనంతరం సిఐ అనోక్ కేపీఎల్ క్రికెట్ పోటీలను టాస్ వేసి ప్రారంభించి యువత చెడు అలవాట్ల బారిన పడకుండా క్రీడల్లో రాణించాలని క్రీడలతో శారీరకంగా మానసికంగా, అర్యోగంగా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమం లో క్రీడాకారులు, ఆర్గనైజేషన్ సభ్యులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మగూడెంలో ఉచిత 'ఈఎన్‌టీ' వైద్య శిబిరం..

- పేదలకు నాణ్యమైన వైద్యం అందడం అభినందనీయం...సర్పంచ్ సంధ్య వెంకన్న
- డాక్టర్ చెవుల శ్వేత ఆధ్వర్యంలో 150 మందికి పరీక్షలు..




**కట్టంగూర్, మహా :** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం లో నిర్వహించిన ఉచిత చెవిముక్కుగొంతు (ఈఎన్‌టీ) వైద్య శిబిరం ఆదివారం విజయవంతమైంది. నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రముఖ చిన్మయి ఆస్పత్రికి చెందిన నిపుణులు డాక్టర్ చెవుల శ్వేత ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సుంకరబోయిన సంధ్య వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నగరాలకు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేద ప్రజల కోసం డాక్టర్ శ్వేత స్వయంగా గ్రామానికి వచ్చి ఈ శిబిరాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా ముక్కు మరియు గొంతు సంబంధిత సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని ఆమె గ్రామస్తులకు సూచించారు. ఈ శిబిరంలో భాగంగా డాక్టర్ శ్వేత ఆధునిక పరికరాలతో సుమారు 150 మందికి పైగా గ్రామస్తులు, విద్యార్థులు మరియు పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాధితులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే అలర్జీలు వినికిడి లోపాలు మరియు గొంతు ఇన్ఫెక్షన్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శ్వేత స్వయంగా రోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాయప్ప, గ్రామ పెద్దలు మేకల శంకర్, బంటు రాంబాబు, అలెగ్జాండర్, మొర్సు వెంకన్న, కృష్ణయ్య, అంగన్వాడీ టీచర్ కళమ్మ, తరాల పరమేశ్ యాదవ్, గాలి సంధ్యారాణి, నాగార్జున, చైతన్య మరియు చిన్మయి ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రుణమాఫీ ఏది? రైతుల ఆవేదన..

- పానగల్ రైతు వేదిక వద్ద బాధితుల నిరసన..
- బ్యాంకు పేరు మార్పుతో తలెత్తిన 'ఐఎఫ్ఎస్సీ' చిక్కులు..
- రోడ్డుపై బైఠాయించి ఆందోళన, అధికారుల నిర్లక్ష్యంపై ధ్వజం..



**నల్లగొండ, మహా :** ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమ దరికి చేరడం లేదంటూ నల్లగొండ జిల్లాలోని పానగల్ ఖాజీ రామారం రైతు వేదిక వద్ద రైతులు ఆదివారం భారీ నిరసన చేపట్టారు. బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ అలసత్వం కారణంగా సుమారు 300 మంది రైతు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో తమకు రుణమాఫీ వర్తించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు.ముఖ్యంగా ఏపీజీవీబీ (APGVB) బ్యాంకు ఇటీవల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (TGGVB) గా రూపాంతరం చెందడంతో ఐఎఫ్ఎస్సీ (IFSC) కోడ్‌ల మార్పు జరిగిందని దీనివల్ల డేటా మిస్ మ్యాచ్ అయ్యి తమకు రుణమాఫీ నిధులు జమ కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. జనవరి 1, 2025న బ్యాంకుల విలీనం జరిగినప్పటికీ, జనవరి 18న ప్రభుత్వం విడుదల చేసిన నాలుగో విడత రుణమాఫీలో తమ పేర్లు లేకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. రేషన్ కార్డు లేని రైతులకు సైతం రుణమాఫీ క్లియర్ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నా, ఏపీజీవీబీ ఖాతాదారులైన తమకు మాత్రం అన్యాయం జరిగిందని బాధితులు వాపోతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై రైతుల ధ్వజం..**

బ్యాంకు అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదని, ఒకరిపై ఒకరు సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరుగు గ్రామాల నుంచి తరలివచ్చిన దాదాపు 300 మంది రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, సాంకేతిక సమస్యలను పరిష్కరించి తమ ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు.

## నేటి తరం మనుషులకు సీతారాములే ఆదర్శం



**మందమర్రి, మహా :** నేటి తరం మనుషులకు సీతారాములే ఆదర్శమని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మంచిర్యాల జిల్లా జెడ్పి చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి లు అన్నారు. ఆదివారం పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు గుడ్ల రమేష్ హనుమాన్ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ఇరువురు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 41 రోజులపాటు శ్రీరామ ప్రథమ భక్తుడు ఆంజనేయస్వామి కఠోర దీక్షను పొంది దేవాలయంలో భక్తి భజనలు చేయడం మనశ్శాంతినిస్తుందని పేర్కొన్నారు. ఈ దీక్షను పొందిన వారికి స్వామివారి కరుణాకటాక్షాలు కలుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, అర్జున్ మహంతి, ముడారపు శేఖర్, ఎర్ర రాజు, రాకం సంతోష్, మద్దెల విజయ్, రాచర్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య




**మంచిర్యాల, మహా :** పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అన్నారు. ఆదివారం జైపూర్ మండలం ముదిగుంట గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ స్థాయి నుండి పారిశుద్ధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్లు, ఇతర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసేలాచర్యలు చేపట్టాలని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రతను మరింత మెరుగుపరచాలని, ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని సూచించారు.నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పురోగతి పై వివరాలు తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులు సంక్షేమ ఫలాలు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ బియ్యం, పెన్షన్‌ల వంటి సౌకర్యాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని, సమస్యల పరిష్కారంపై అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వెల్లడించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, పంచాయతీ కార్యదర్శికి పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై పలు సూచనలు చేశారు. పన్నుల వసూలు, మురుగు కాలువ వ్యవస్థ శుభ్రత, వర్షపు నీటి సంరక్షణ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు గ్రామపంచాయతీ సిబ్బందిని అభినందించారు.

**మాన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రధాని ప్రశంసలు**

ఆదివారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ముదికుంట గ్రామంలో మన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గ్రామపంచాయతీని ప్రశంసించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ గ్రామపంచాయతీలో నెలకొన్న రూఫ్‌టాప్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీల చివర కమ్యూనిటీ సోక్ పిట్స్ ఏర్పాటు చేసి నీటి సంరక్షణ చర్యలను బలోపేతం చేయాలని ఎం. పి. ఓ., ఎ. పి. ఓ., పంచాయితీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బాపు, ఎ.పి.ఓ., డి.పి.ఎం. సర్పంచ్, వార్డు సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ANN
HEALTH & BUSINESS AWARDS-2026

# Scan here.

Step Forward. Get Recognized. Be Celebrated.







# ముగ్గురు బ్యూటీస్ నాగ్ కోసం..

తెలుగు సీనియర్ హీరోల్లో నాగార్జున సరైన సక్సెస్ చూసి చాలాకాలమైంది. గతేడాది కుబేర్, కూలీ సినిమాల్లో కాస్త డిఫరెంట్ పాత్రలు చేసి ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం హీరోగా 100వ మూవీ చేస్తూ బిజీగా ఉన్నాడు. ఈ మూవీ గురించి సోషల్ మీడియాలో తప్పితే అధికారికంగా ఎలాంటి అప్‌డేట్స్ రావడం లేదు. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ల గురించి డిస్కషన్ నడుస్తోంది. ఏకంగా ముగ్గురు బ్యూటీస్ నాగ్ సరసన నటించబోతున్నారట. గతంలో నిన్నే పెళ్లాడతా లాంటి సినిమాలో కెమిస్ట్రీతో అదరగొట్టిన నాగ్‌టబు.. ఈ సినిమా కోసం మళ్లీ కలుస్తున్నారట. చాన్నాళ్ల క్రితమే ఈ రూమర్ బయటకొచ్చింది. కానీ నిజమా కాదా అనేది మాత్రం క్లారిటీ రాలేదు. తాజాగా 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ ఐశ్వర్య రాజేశ్ కూడా మరో కథానాయికగా ఎంపికైందని అంటున్నారు. వీళ్లిద్దరితో పాటు సుస్మితా భట్ అనే తమిళ బ్యూటీ కూడా ఇందులో



ఉందని టాక్ వినిపిస్తోంది.తమిళ దర్శకుడు ఆర్.కార్తిక్ తీస్తున్న ఈ సినిమా లాటరీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా తీస్తున్నారని తెలుస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ అనుకుంటున్నారట. ఈ స్టోరీని గట్టిగా నమ్మిన నాగ్.. తనే స్వయంగా నిర్మిస్తున్నారు కూడా. ఏదేమైనా నాగ్ సరసన ముగ్గురు హీరోయిన్లు అనే రూమర్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఆసక్తికర టాపిక్ అయిపోయింది.

# ఓటీటీలో ఉస్తాద్ భగత్‌సింగ్..!

పవన్ కల్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్‌సింగ్ ఓటీటీ స్ట్రీమింగ్ గురించి నెట్టింట వైరల్ అవుతుంది. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కించిన ఈ చిత్రం మార్చి 19న విడుదలైన సంగతి తెలిసిందే. అయితే, ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ పరంగా కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. ఇప్పటి వరకు సుమారు రూ. 70 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించినట్లు ప్రముఖ ట్రేడ్ సంస్థ సాక్నిల్క్ పేర్కొంది. ఓవర్సీస్‌లో ఉస్తాద్ కనీసం 1మిలియన్ మార్క్ కూడా దాటలేదు. ధురంధర్2 హిట్ కావడంతో చాలా స్క్రీన్స్ నుంచి ఉస్తాద్ భగత్‌సింగ్ చిత్రాన్ని తొలగించారు. 'ఉస్తాద్ భగత్‌సింగ్' ప్రేక్షకులకు పెద్దగా కనెక్ట్ కాకపోవడంతో పాటుగా ధురంధర్2 దెబ్బ కూడా గట్టిగానే ప్రభావం చూపింది. దీంతో థియేట్రికల్ రన్‌లో బోల్తా పడింది. ఈ క్రమంలో వీలైనంత త్వరగా ఓటీటీలో విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించుకున్నారట. ఏప్రిల్ 17న నెట్‌ఫ్లిక్స్(Netflix)లో స్ట్రీమింగ్‌కు తీసుకురావాలనే ప్లాన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ తేదీలో కుదరకపోతే ఏప్రిల్ 24న తప్పకుండా ఉస్తాద్ ఓటీటీ ఎంట్రీ ఉంటుందని ప్రచారం జరుగుతుంది. థియేటర్స్‌లో మెప్పించలేని ఈ మూవీ కనీసం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో అయినా మంచి రెస్పాన్స్ సాధిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



# సింగర్ నుంచి ఐటమ్ డ్యాన్సర్‌గా..

పాటలు పాడే సింగర్స్ మహా అయితే మ్యూజిక్ డైరెక్టర్స్ అవుతారు. కొన్నిసార్లు మాత్రం ఊహించని సర్‌ప్రైజ్ ఇస్తుంటారు. లేటెస్ట్‌గా ఓ తెలుగు గాయని.. ఐటమ్ సాంగ్‌లో గ్లామరస్ డ్యాన్స్ చేసి అదరగొట్టింది. ఆమెనే జోనితా గాంధీ. తెలుగు ప్రేక్షకుల్లో కొందరికి ఈమె గురించి తెలుసు. అయితే ఈమె నుంచి అదిరిపోయే డ్యాన్స్ చూసి మాత్రం ఆశ్చర్యపోయారు. ఇంతకీ ఈమె ఎవరు? డీటైల్స్ ఏంటి? జోనితా గాంధీ ఢిల్లీలో పుట్టింది. ఈమెకు 9 నెలల వయసున్నప్పడే కుటుంబమంతా కెనడా వెళ్లిపోయింది. తర్వాత అక్కడే సెటిలైపోయారు. దీంతో చదువంతా అక్కడే పూర్తి చేసింది. ఏడేళ్లు ఉన్నప్పడే పాటలు పాడటం లాంటివి చేసింది. తర్వాత కొన్నేళ్లకు తన పాడిన పాటల్ని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసేది. వాటికి మంచి రెస్పాన్స్ వస్తుండేసరికి పాడటాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకుంది. కొన్నాళ్లకు భారత్‌కి తిరిగొచ్చింది. జోనితాలోని ప్రతిభని గుర్తించిన బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్-శేఖర్.. షారూఖ్ ఖాన్ 'చెన్నై ఎక్స్‌ప్రెస్' టైటిల్ సాంగ్ పాడే అవకాశం కల్పించారు. తొలి పాటే ఎస్పీ బాలసుబ్రమణ్యం లాంటి ప్రసిద్ధ గాయకుడితో కలిసి పాడేసరికి జోనితాకు ఫేమ్ వచ్చింది. తర్వాత ఏఆర్ రెహమాన్, ప్రీతమ్, అమిత్ త్రివేది తదితర సంగీత దర్శకులు కంపోజ్ చేసిన సాంగ్స్ పాడింది. అనిరుధ్‌తో కలిసి ఈమె పాడిన కావాలయ్యా, అరబిక్ కుతు లాంటి పాటలు సెన్సేషన్ సృష్టించాయి. 'కిక్ 2' మూవీలోని నువ్వే నువ్వే ప్రాణం పాటతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. లవ్ స్టోరి, సర్కారు వారి పాట తదితర చిత్రాల్లో సాంగ్స్ పాడింది. ఓవరాల్‌గా చూస్తే తెలుగు, తమిళ, కన్నడ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, ఉర్దూ, ఇంగ్లీష్‌లో పాటలు పాడి మెప్పించింది. ఇన్ స్టాలో 28 లక్షల ఫాలోవర్స్ ఉన్న ఈమె.. లైవ్ కన్సర్ట్‌స్‌తోనూ సంగీత ప్రియుల్ని ఎంటర్‌టైన్ చేస్తూనే ఉంది. ఇన్నాళ్లు సింగర్‌గా అందరికీ తెలిసిన జోనితా గాంధీ.. అడివి శేష్ 'డకాయిట్' కోసం తొలిసారి ఐటమ్ సాంగ్‌లో డ్యాన్స్ చేసింది. అందచందాలతో ఆశ్చర్యపరిచింది. చూస్తుంటే సింగర్‌గా ఏమో గానీ డ్యాన్సర్‌గా మాత్రం మరింత బిజీ అవుతుందేమో అనిపిస్తుంది. ఈమె నటించిన తమిళ సినిమా 'వాకింగ్ టాకింగ్ స్ట్రాబెర్రీ ఐస్‌క్రీమ్' విడుదల కావాల్సి ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com